




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 1 సంచిక : 242 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు గురువారం 7 మే 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :242 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE THU 7 MAY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# రైతులకు వేగంగా విత్తన సరఫరా చేయాలి

**మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్**

**పంటలకు ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్ ద్వారా అధిక ఆదాయం**

**వ్యవసాయ, ఉద్యాన పంటల కొనుగోళ్ల అంశంపై సీఎం చంద్రబాబు సమీక్ష**

పెన్ పవర్ డెస్క్:ఈ ఏడాది మే 15 నుంచే రైతులకు సాగునీరు అందించనున్న దృష్ట్యా రాష్ట్రంలో వేగంగా విత్తన సరఫరా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవసాయ శాఖకు దిశానిర్దేశం చేశారు. విత్తనాల సరఫరా కోసం రూ.200 కోట్లు కేటాయించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. సచివాలయంలో బుధవారం రాష్ట్రంలో ధాన్యం, అరటి, పొగాకు, ఆయిల్ పామ్ తదితర పంటల కొనుగోళ్లపై ముఖ్యమంత్రి వ్యవసాయ, ఉద్యాన శాఖలతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు మంత్రి కె. అచ్చెన్నాయుడు, వ్యవసాయ, ఉద్యాన శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా రైతులు పండించే పంటలకు ధరలు దక్కేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్ ద్వారా పంటలకు మెరుగైన ధర లభించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రైతుకు లాభసాటిగా ఉండేలా నాణ్యమైన పంట దిగుబడులు వచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. మరిన్ని పంటలను ప్రకృతి సేద్యం విధానంలో సాగు చేస్తే రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందని అన్నారు.



సేంద్రీయ సాగుకు కంపోస్టు ఎరువును సరఫరా చేసేలా చూడాలన్నారు. ఈ ఏడాది 42.06 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంట ఉత్పత్తి వస్తుందని అధికారులు వివరించారు. మొక్క జొన్న సహా ఇతర పంటల ద్వారా ఇథనాల్ తయారీకి ఉన్న అవకాశాలను అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచనలు చేశారు. మామిడిని ప్రాసెసింగ్ యూనిట్లు

మిగతా 2లో



## అలా చేస్తే కేసులు వాపస్: మంగ్లీకి న్యాయవాది సుబ్బారావు కీలక సూచన

- బాధితులకు డబ్బులు చెల్లిస్తే కేసులు వాపస్ తీసుకుంటామన్న న్యాయవాది
- కానీ ఈ కేసులో ఆమె తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం
- మంగ్లీ, ఆమె సోదరుడిపై వివిధ పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయని వెల్లడి
- వీటికి వారు ఏం సమాధానం చెబుతారని ప్రశ్న

మిగతా 2లో



## మెదక్‌లో దారుణం.. పసికందును రూ.1.50 లక్షలకు అమ్మేసిన నర్సు

- బిడ్డ చనిపోయిందని తల్లిని నమ్మించి మోసం
- రూ.1.50 లక్షలకు శిశువును విక్రయించిన వైనం
- ఐదు రోజుల తర్వాత తల్లికి తెలిసిన అసలు నిజం
- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

మిగతా 2లో



## రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు 17వ ఎస్ఐపీబీ ఆమోదం

- విశాఖలో రూ.1 లక్ష కోట్లతో రిలయన్స్ డేటా సెంటర్‌కు గ్రీన్ సిగ్నల్
- సత్యసాయి జిల్లాలో రూ.51 వేల కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్
- కడపలో రూ.12 వేల కోట్లతో అదానీ హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు
- తిరుపతిలో రూ.2,500 కోట్లతో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటర్ సైకిల్ తయారీ పరిశ్రమ
- రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం... 39 వేల మందికి ఉద్యోగాలు
- నిర్దేశిత గడువుకు ముందే అనుమతులతో ఓ బ్రాండ్ సృష్టిద్దాం
- సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 17వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల బోర్డు సమావేశం

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి వస్తోంది. విశాఖలో రిలయన్స్ సంస్థ రూ.1,08,010 కోట్లతో డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. అలాగే సత్యసాయి జిల్లాలో రూ.51 వేల కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్ ను, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టంను కూడా రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనుంది. కడపలో రూ.12 వేల కోట్లతో అదానీ హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును, తిరుపతిలో రూ.2,500 కోట్లతో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటర్ సైకిల్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. వీటితో పాటు పలు పెట్టుబడులకు రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు బుధవారం ఆమోదం తెలిపింది.

మిగతా 2లో

## విమర్శించడం తప్ప పేర్ని నానికి బందరు ప్రయోజనాలు పట్టవు



- బందరు చరిత్ర తిరగరాసేలా నగరాన్ని అభివృద్ధి చేస్తామన్న కొల్లు రవీంద్ర
- రోడ్లు, తాగునాటి సౌకర్యాలు కల్పించడమే ప్రధాన లక్ష్యమని వెల్లడి
- గత ప్రభుత్వం టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందకుండా చేసిందని విమర్శ

మిగతా 2లో

# తమిళ రాజకీయాల్లో కొత్త ట్విస్ట్!

## విజయ్‌కు పోటీగా డీఎంకే, అన్నాడీఎంకే కలుస్తాయా?

- డీఎంకే, అన్నాడీఎంకే మధ్య పొత్తు కోసం చర్చలు జరుగుతున్నట్లు ప్రచారం
- రెండు పార్టీలు కలిసినా, ప్రభుత్వ ఏర్పాటుకు చిన్న పార్టీల సహకారం తప్పనిసరి
- అన్నాడీఎంకేతో కలవబోమన్న డీఎంకే నాయకుడు

పెన్ పవర్ డెస్క్:తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త ట్విస్ట్! బద్ధ రాజకీయ శత్రువులైన డీఎంకే, అన్నాడీఎంకే మధ్య పొత్తు కోసం చర్చలు జరుగుతున్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. అయితే ఈ ప్రచారాన్ని డీఎంకే పార్టీ కొట్టి వేయడం గమనార్హం. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ టీవీకే పార్టీ 108 స్థానాలు గెలిచి, మేజిక్ ఫిగర్‌కు 10 సీట్ల దూరంలో ఉంది. కాంగ్రెస్ పార్టీ (5) మద్దతిచ్చినప్పటికీ విజయ్‌కి బలం సరిపోలేదు. దీంతో విజయ్ ప్రమాణ స్వీకారం వాయిదా పడినట్లు కూడా వార్తలు వచ్చాయి. ఈ సమయంలో ఆసక్తికర అంశం వెలుగులోకి వచ్చింది. తమకు తగినంత సంఖ్యాబలం ఉందని డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు గవర్నర్‌కు సంకేతాలు కూడా పంపించినట్లు వార్తలు వస్తున్నాయి. చర్చలు జరిగాయని

మిగతా 2లో





### విద్యలో గాలిలో మేడలు వద్దు గట్టి పునాదే ముద్దు...

## అక్కడి నుంచే లోకేశ్ సంస్కరణలు

- పాఠశాల విద్యలో సమస్యలు గుర్తింపు.. సంస్కరణల అమలు
- పునాది దశ అభ్యసనాలు మెరుగుపరిచేందుకు ప్రణాళికలు అమలు
- జీ-ఎఫ్ఎల్ఎన్, టీపీఆర్ఎల్‌తో ప్రాథమిక విద్యలోనే బలమైన పునాది
- ఫ్యాన్సీ విద్యా విధానాల జోలికి వెళ్లని మంత్రి లోకేశ్

పెన్ పవర్ డెస్క్:గాలిలో మేడలు కట్టొద్దు అని హితవు చెప్పే పెద్దలు నేలపై నిలబడమంటారు. సవాళ్లతో కూడిన విద్యాశాఖను చేపట్టిన నారా లోకేశ్ గాలిలో మేడలు కట్టే యంత్రాంగానికి అసలు మన విద్య ఎక్కడుందో చూడండంటూ

మిగతా 2లో

## విజయ్‌కు షాకిచ్చిన గవర్నర్.. ప్రభుత్వ ఏర్పాటుకు బ్రేక్

- రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన విజయ్
- మ్యాజిక్ ఫిగర్ 118కి మరో 6 సీట్లు తక్కువగా ఉన్న వైనం
- 118 మంది సభ్యుల సంతకాలు ఉంటేనే ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానిస్తానన్న గవర్నర్



పెన్ పవర్ డెస్క్:తమిళనాడు రాజకీయాల్లో అనూహ్య మలుపు చోటుచేసుకుంది. ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైన టీవీకే అధినేత విజయ్‌కు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ నుంచి ప్రతికూల స్పందన ఎదురైంది. రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన విజయ్‌కు,

మిగతా 2లో

## ఇరాన్ సహకరించకుంటే మళ్లీ బాంబుదాడులు మొదలవుతాయి

- ఇరాన్ ఒప్పందం కుదుర్చుకుంటే ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ ముగిసిపోతుందన్న ట్రంప్
- ఇరాన్ సహా అందరికీ హర్మూజ్ జలసంధి తెరుచుకుంటుందని వెల్లడి
- లేదంటే గతంలో కంటే భీకరస్థాయిలో బాంబు దాడులు ఉంటాయన్న ట్రంప్



పెన్ పవర్ డెస్క్:ఒప్పందానికి ఇరాన్ సహకరిస్తే హర్మూజ్ జలసంధి తెరుచుకుని అంతా ప్రశాంతంగా ఉంటుందని, లేదంటే మళ్లీ బాంబు దాడులు మొదలవుతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ తమతో ఒప్పందం కుదుర్చుకుంటే ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ ముగిసిపోతుందని అన్నారు. అప్పుడు ఇరాన్ సహా అందరికీ హర్మూజ్

మిగతా 2లో




## ఏపీకి రూ.1000 కోట్ల పెట్టుబడి..

**క్యారియర్ ఏసీ పరిశ్రమకు మంత్రి లోకేశ్ శంకుస్థాపన**

- శ్రీసిటీలో క్యారియర్ ఏసీల తయారీ యూనిట్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి
- రూ.1000 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు.. 3000 మందికి ఉపాధి అవకాశాలు
- సీఎం చంద్రబాబు తన గదిని 17కేజ వద్ద ఉంచుతారని లోకేశ్ సరదా వ్యాఖ్య
- డేటా సెంటర్లను ఆకర్షించడమే కాదు, వాటి తయారీ వ్యవస్థనే నిర్మిస్తున్నామన్న లోకేశ్
- డేటా సెంటర్ల రంగంలో ఏపీ అగ్రగామిగా నిలుస్తుందని ధీమా

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# విద్యలో గాలిలో మేడలు వద్దు గట్టి పునాదే ముద్దు...
# అక్కడి నుంచే లోకేశ్ సంస్కరణలు

- మొదటి పేజి తరువాయి

ఆదేశాలిచ్చారు. విదేశాల్లో విద్యాభ్యాసం పూర్తి చేసుకుని, విదేశాల్లోనే వరల్డ్ బ్యాంకులో ఉన్నత ఉద్యోగం చేసిన లోకేశ్ విద్యాశాఖలో ఫ్యాన్సీ విదేశీ విద్యావిధానాలు అమలు చేయాలని యత్నించలేదు. గత పాలకుల మాదిరిగా టోఫెల్, ఐబీ అంటూ నేల విడిచి సాము చేయలేదు. నేషనల్ అచీవ్ మెంట్ సర్వే, యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ నివేదికల మేరకు కనీస అభ్యసనా సామర్థ్యాలు విద్యార్థుల్లో లేవని గుర్తించారు. ఇవి పెంపొందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

**దేశంలోనే తొలిసారిగా .గ్యారెంటీడ్ ఎఫ్ఎల్ఎన్**

భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా 38391 ప్రాథమిక పాఠశాలల్లో గ్యారెంటీడ్ ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ (జీ-ఎఫ్ఎల్ఎన్) అమలు ఆరంభించారు. ప్రతీ విద్యార్థికి బలమైన పునాది అభ్యసనాలు ఒత్తిడితో కాదు, ఉల్లాసంతో, ఆటపాటలతో మొదలవ్వాలి. అందుకే మన ప్రభుత్వ పాఠశాలల్లో 1, 2 తరగతుల విద్యార్థుల కోసం గ్యారెంటీడ్ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (జీ-ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. మన ప్రాథమిక పాఠశాలల్లోకి అడుగుపెడితే, విద్యార్థులు పుస్తకాల్లోని అంశాలను బట్టీ పట్టడం కాకుండా, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్, ఎడ్యుటైన్‌మెంట్ యాక్టివిటీస్ వంటి, బాలా ఫీచర్స్ వంటి బోధన ద్వారా ఎంతో సరదాగా, ఆహ్లాదకరంగా, ఆనందంగా, ఆడుతూ పాడుతూ నేర్పుతున్నారు. చిత్రాల ద్వారా అక్షరాలు నేర్చుకోవడం, ఆటల ద్వారా అంకెలు లెక్కించడం వంటి పద్ధతుల ద్వారా తెలుగు, ఇంగ్లీష్ భాషలను బోధిస్తున్నారు.జ్ఞానజ్యోతి, జ్ఞానప్రకాశ్ వంటి మాడ్యూల్స్ ద్వారా ప్రతి అక్షరాన్ని, ప్రతి శబ్దాన్ని అనుభూతి చెందుతూ విద్యార్థులు నేర్చుకుంటున్నారు. పెద్ద తరగతులకు వెళ్ళే వరకు వేచిచూడకుండా, మొదటి నుండే పునాదిని బలంగా నిర్మించడం గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ ప్రత్యేకత. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలకు అనుగుణంగా, వారి స్థాయిని అంచనా వేసి తదనుగుణంగా పాఠ్య ప్రణాళిక సిద్ధంచేశారు. రెగ్యులర్ క్లాసులు పూర్తయిన తరువాత మధ్యాహ్నం 1 గంట నుంచీ 3.30 వరకూ రెమెడియల్ సెషన్స్ కొనసాగిస్తున్నారు.

**సులభతర బోధనకు, బోధనాభ్యసన సామగ్రి పంపిణీ**

ఆంధ్రప్రదేశ్‌లో గ్యారెంటీడ్ ఎఫ్.ఎల్.ఎన్. కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సమగ్ర శిక్ష పాఠశాలలకు, విద్యార్థులకు వివిధ రకాల బోధనా సామగ్రిని (టీఎల్ఎస్) అందజేశాయి. 2025-26 విద్యా సంవత్సరంలో సరఫరా చేసిన వస్తువుల వివరాలు ఇక్కడ ఉన్నాయి:

**అభ్యాస కిట్లు (లర్నింగ్ కిట్స్)**

1. జాదూయ్ పిటారా: ఇది ఆటల ద్వారా నేర్చుకోవడానికి రూపొందించిన ఒక మ్యాజిక్ బాక్స్ వంటి కిట్. ఇందులో ఆటబొమ్మలు, పజిల్స్, ఫ్లాష్ కార్డులు, కృత్యాధార బోధన కోసం అవసరమైన 62 వస్తువులు ఉంటాయి. ఇది రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 12,000 పాఠశాలలకు అందించబడింది.
2. ఎఫ్.ఎల్.ఎన్ లెర్నింగ్ కిట్లు: స్కూల్ కాంప్లెక్స్ ద్వారా మిగిలిన 26391 పాఠశాలలకు పంపిణీ చేశారు. ప్రాథమిక విద్యార్థుల్లో భాషా, గణిత సామర్థ్యాలను పెంచడానికి ఇవి ఉపయోగపడతాయి.
3. ఎఫ్.ఎల్.ఎన్ ప్రింట్ రిచ్ మెటీరియల్: పాఠశాలల్లోని తరగతి గదులను అభ్యసన కేంద్రాలుగా మార్చడంలో ప్రింట్ రిచ్ మెటీరియల్ కీలక పాత్ర పోషిస్తుంది. ఇది విద్యార్థులు తమ చుట్టూ ఉన్న వాతావరణం ద్వారా సహజంగా భాషను, అక్షరాలను నేర్చుకోవడానికి తోడ్పడుతుంది. ఎఫ్.ఎల్.ఎన్ అమలులో భాగంగా వర్ణమాల, గుణింతాలు, సంఖ్యలు, కీలక పదాల చార్టులు, నిత్యం కొత్త పదాలను ప్రదర్శించే వర్డ్ వాల్, బొమ్మల కథల పుస్తకాలు, ఫ్లాష్ కార్డ్స్ కలిగిన రీడింగ్ కార్నర్స్, తరగతి గదిలోని వస్తువులకు బైలింగువల్ లేబులింగ్, విద్యార్థుల సృజనాత్మకతను చాటే వర్క్ డిస్ ప్లే, బొమ్మలతో కూడిన సూచన బోర్డులను ప్రభుత్వం అందించింది. ఈ మెటీరియల్ ద్వారా విద్యార్థులు ఖాళీ సమయంలో కూడా నిరంతరం నేర్చుకుంటూ, చదువు పట్ల భయాన్ని వీడి పఠనాసక్తిని పెంపొందించుకుంటారు.
4. బీఏఎల్ఏ ఫీచర్లు: పాఠశాల భవనాన్ని కేవలం నాలుగు గోడల నిర్మాణంగా కాకుండా, ఒక సజీవ బోధనా సాధనంగా మార్చడమే బీఏఎల్ఏ యొక్క అసలు ఉద్దేశం. ఈ విధానం విద్యార్థుల విభిన్న అభ్యసన శైలులకు అనుగుణంగా ఉంటూ, చూసి నేర్చుకునే వారికి ఆకర్షణీయమైన చిత్రాలను, చేసి నేర్చుకునే వారికి నేలపై ఇంటరాక్టివ్ ఆటలను అందిస్తుంది. దీనివల్ల నెమ్మదిగా నేర్చుకునే పిల్లలు సైతం ఎలాంటి ఒత్తిడి లేకుండా విషయాలను సులభంగా అవగాహన చేసుకుంటారు. గోడలపై ఉండే సైన్స్ రేఖాచిత్రాలు లేదా స్థానిక మ్యాపులు పిల్లల్లో చక్కని జిజ్ఞాసను రేకెత్తించి, పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా స్వతంత్రంగా ఆలోచించేలా ప్రేరేపిస్తాయి. చదువును నిజ జీవితంతో, స్థానిక సంస్కృతితో అనుసంధానించడం ద్వారా అభ్యసనం మరింత అర్థవంతంగా మారుతుంది.
5. చైల్డ్ ఫ్రెండ్లీ ఫర్నిచర్: కొన్ని ఎంపిక చేసిన పాఠశాలలకు విద్యార్థులు సౌకర్యవంతంగా కూర్చుని కృత్యాలు చేయడానికి అనువైన ఫర్నిచర్ ఇచ్చారు.
6. అవుట్ డోర్ ప్లే మెటీరియల్: శారీరక వికాసం, ఆటల ద్వారా అభ్యసనానికి కావాల్సిన వస్తువులను సరఫరా చేశారు.

**వర్క్ బుక్స్, మెటీరియల్ (75 రోజుల యాక్షన్ ప్లాన్)**

గ్యారెంటీడ్ ఎఫ్.ఎల్.ఎన్. కోసం ప్రత్యేకంగా రూపొందించిన 75 రోజుల యాక్షన్ ప్లాన్ బుక్స్ అందించారు.

స్థాయిల వారీ పుస్తకాలు: విద్యార్థుల స్థాయిని బట్టి స్ట్రీమ్ (Stream), మౌంటైన్ (Mountain), స్కై (Sky) అనే మూడు స్థాయిలలో విడివిడిగా యాక్టివిటీ షీట్లు, మెటీరియల్ ఇచ్చారు.

ఉపాధ్యాయుల హ్యాండ్ బుక్స్: 1 ఁ 2 తరగతులకు ఒకటి, 3 నుండి 5 తరగతులకు మరొకటి చొప్పున టీచర్లకు గైడ్ బుక్స్ అందజేశారు.

# విజయ్‌కు షాకిచ్చిన గవర్నర్..
# ప్రభుత్వ ఏర్పాటుకు బ్రేక్

- మొదటి పేజి తరువాయి

సంఖ్యాబలం విషయంలో స్పష్టమైన నిబంధనలను గవర్నర్ గుర్తుచేశారు. తగినంత మెజారిటీ లేనిదే ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతి ఇవ్వలేమని గవర్నర్ స్పష్టం చేయడంతో తమిళనాడులో రాజకీయ సస్పెన్స్ మరింత ముదిరింది.ప్రభుత్వ ఏర్పాటుకు కావలసిన మ్యాజిక్ ఫిగర్ 118. అయితే ప్రస్తుత సమీకరణాల ప్రకారం టీవీకే బలం 108 సీట్లు (విజయ్ రెండు చోట్లా గెలవడంతో ఒక సీటుకు రాజీనామా చేయాల్సి ఉంటుంది. కాబట్టి నికరంగా 107). మద్దతు ఇస్తున్న కాంగ్రెస్ బలం 5 సీట్లు. దీంతో మొత్తం బలం 112 అవుతుంది. ఈ క్రమంలో విజయ్ పార్టీకి మరో 6 మంది ఎమ్మెల్యేల అవసరం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే టీవీకేకు ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు.

విజయ్ గవర్నర్‌తో మాట్లాడుతూ, కాంగ్రెస్‌తో పాటు మరికొన్ని చిన్న పార్టీలు తమకు మద్దతు ఇస్తున్నాయని, ప్రమాణస్వీకారం తర్వాత అసెంబ్లీలో మెజారిటీ నిరూపించుకుంటానని వివరించారు. అయితే, ముందే 118 మంది సభ్యుల సంతకాలతో కూడిన మద్దతు లేఖ ఉంటేనే ఆహ్వానిస్తామని గవర్నర్ స్పష్టం చేసినట్టు తెలుస్తోంది.

అన్నాడీఎంకే పార్టీకి ఉన్న 47 మంది ఎమ్మెల్యేలలో సీవీ షణ్ముగం నేతృత్వంలోని ఒక వర్గం (సుమారు 35 మంది) విజయ్‌కు మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు, పీఎంకే (4), ఐయూఎంఎల్ (2), సీపీఐ (2), సీపీఎం (2) వంటి పార్టీల మద్దతు కూడగట్టడంపై టీవీకే నేతలు చర్చలు జరుపుతున్నారు.

ప్రస్తుతానికి ఈ 6 మంది ఎమ్మెల్యేల కొరత తీరితే తప్ప విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసే అవకాశం లేదు. మే 9న ప్రమాణస్వీకారం చేయాలని టీవీకే భావిస్తున్న తరుణంలో, వచ్చే 24 గంటలు అత్యంత కీలకంగా మారనున్నాయి.

# ఏపీకి రూ.1000 కోట్ల పెట్టుబడి..

ఏపీని పారిశ్రామికంగా, సాంకేతికంగా అగ్రస్థానంలో నిలబెట్టే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా తిరుపతి జిల్లాలోని శ్రీసిటీలో ప్రపంచ ప్రసిద్ధ ఎయిర్ కండిషనర్ల తయారీ సంస్థ 'క్యారియర్ గ్లోబల్' యూనిట్‌కు రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు కోసం క్యారియర్ సంస్థ సుమారు రూ. 1,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 3,000 మందికి ఉపాధి, జీవనోపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... క్యారియర్ కేవలం ఒక కంపెనీ కాదని, ప్రపంచ శీతలీకరణ సాంకేతికతలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన మార్గదర్శి అని ప్రశంసించారు. తన జీవితంలో కొనుగోలు చేసిన మొట్టమొదటి ఏసీ కూడా క్యారియర్ బ్రాండ్‌దేనని ఆయన గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకుంటూ, సీఎం చంద్రబాబు నాయుడు తన గదిని ఎప్పుడూ 17 డిగ్రీల సెల్సియస్ వద్ద చల్లగా ఉంచుకోవడానికి ఇష్టపడతారని, ఇప్పుడు ఆ గదిలో కూడా క్యారియర్ ఏసీనే ఉందని లోకేశ్ సరదాగా వ్యాఖ్యానించారు. దీంతో సభలో నవ్వులు పూశాయి.

**డేటా సెంటర్ల తయారీ హబ్‌గా ఏపీ**

అనంతరం మంత్రి లోకేశ్ రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలపై తన దార్శనికతను ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్‌ను కేవలం డేటా సెంటర్లను ఆకర్షించే రాష్ట్రంగా కాకుండా వాటికి అవసరమైన పూర్తి తయారీ పర్యావరణ వ్యవస్థను (ఎకోసిస్టమ్) నిర్మించే హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. "మేం కేవలం డేటా సెంటర్లను నిర్మించడం లేదు, వాటికి అవసరమైన పూర్తి వ్యవస్థను ఇక్కడే నిర్మిస్తున్నాం" అని ఆయన అన్నారు.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా డేటా సెంటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో తీవ్రమైన పోటీ నెలకొని ఉందని, ఈ రేసులో ఏపీ ముందు వరుసలో నిలుస్తుందని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. డేటా సెంటర్లకు అత్యాధునిక కూలింగ్ సిస్టమ్స్, అధిక సామర్థ్యం గల చిల్లర్లు, పవర్ ఎలక్ట్రానిక్స్, ప్రెసిషన్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటివి అత్యంత

కీలకమని, వీటికి అవసరమైన బలమైన సహాయక పర్యావరణ వ్యవస్థను నిర్మించడంపై దృష్టి సారించామని వివరించారు.ఈ బృహత్తర లక్ష్యంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌ను, శ్రీసిటీని ఎంచుకున్నందుకు క్యారియర్ గ్లోబల్ కార్పొరేషన్‌కు ఆయన స్వాగతం పలికారు. ఈ పెట్టుబడి రాష్ట్ర డిజిటల్, పారిశ్రామిక అభివృద్ధిని బలోపేతం చేసే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన అభివర్ణించారు. క్యారియర్ వంటి సంస్థల రాకతో, డేటా సెంటర్లకు అవసరమైన కీలక పరికరాల తయారీ స్థానికంగానే జరిగి, ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ టెక్నాలజీ మ్యాప్‌లో తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంటుందని మంత్రి లోకేశ్ తెలిపారు.

# రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు
# 17వ ఎస్ఐపీబీ ఆమోదం

- మొదటి పేజి తరువాయి

**ప్రతీ ఒప్పందం గ్రౌండ్ కావాలి**

రాష్ట్రంలో పెట్టుబడులకు సంబంధించి వచ్చిన ప్రతీ ప్రతిపాదనా ఒప్పందంగా మారాలని, కుదుర్చుకున్న ప్రతీ ఒప్పందం పెట్టుబడిగా రూపాంతరం చెందాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఒక పెట్టుబడి, పరిశ్రమ రాష్ట్రానికి వచ్చే విషయంలో అనుమతుల నుంచి శంకుస్థాపన, ప్రారంభోత్సవం వరకు నిర్దేశిత గడువులోగా జరిగేలా చూడాలన్నారు. ఒప్పందం చేసుకున్న కంపెనీల శంకుస్థాపన నుంచి ఉత్పత్తి వరకూ నిర్దిష్టమైన కాలపరిమితిలో జరిగేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వపరంగా ఇవ్వాల్సిన అనుమతుల విషయంలో ఒక్క రోజు కూడా జాప్యం జరగకూడదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అనుమతుల జారీ విషయంలో ఏపీ బ్రాండ్ సృష్టించాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పెట్టుబడులను ఆకర్షించాలంటే ఇతరుల కంటే మనం ఎలా భిన్నమో ఏపీలో అనుమతులు ఎంత సులభతరమో వారికి చెప్పాలని స్పష్టం చేశారు. ఏపీలో ప్రాజెక్టులు రావాలన్న తపన ఉన్న అధికారులను అనుమతులు ఇచ్చే స్థానాల్లో నియమించాలని సూచించారు.

**వన్ ఫ్యామిలీ - వన్ ఎంట్రప్రెన్యూర్‌లో ఎంఎస్ఎంఈలు కీలకం**

సచివాలయంలో జరిగిన 17వ ఎస్ఐపీబీ సమావేశంలో 25 ప్రాజెక్టులకు చెందిన రూ.2,01,023 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 39,067 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "పెట్టుబడుల విషయంలో భారీ పరిశ్రమలకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నామో ఎంఎస్ఎంఈలకు అంతే ప్రాధాన్యం ఇవ్వాలి. వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్ విషయంలో ఎంఎస్ఎంఈలు కీలక పాత్ర పోషిస్తాయి. అన్ని పారిశ్రామిక ప్రాంతాలకు గ్యాస్ పైప్ లైన్ అందుబాటులో ఉండేలా మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఫుడ్ ప్రాసెసింగ్ లో రంగంలో రాష్ట్రంలో అపార అవకాశాలు ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకుని పెట్టుబడులు గ్రౌండ్ అయ్యేలా చూడాలి. మన రాష్ట్రంలో ఉద్యాన, వాణిజ్య పంట ఉత్పత్తులకు విలువ జోడింపు జరగాలి. ఆయిల్ పాం, మామిడి, కొబ్బరి, కోకో సహా పలు పంటలకు వ్యాల్యూ అడిషన్ ఇస్తే రైతులకు ఎంతో మంచి జరుగుతుంది" అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమావేశంలో సీఎస్ సాయిప్రసాద్, మంత్రులు టీజీ భరత్, అచ్చెన్నాయుడు, సుభాష్, వివిధ శాఖల అధికారులు, వర్చువల్‌గా మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు.

**17వ ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం పొందిన ప్రతిపాదనల వివరాలు**

**ఇంధన రంగం**

1. రిలయన్స్ ఇండస్ట్రీస్ - శ్రీసత్యసాయి జిల్లాలో సోలార్ పవర్ ప్రాజెక్టు రూ.51,300 కోట్ల పెట్టుబడులు, 20 వేల మందికి ఉద్యోగాలు
2. క్లీన్ రెన్యూబుల్ ఎనర్జీ హైబ్రీడ్ త్రీ లిమిటెడ్, నంద్యాలలో రూ.155 కోట్ల పెట్టుబడులు, 40 మందికి ఉద్యోగాలు
3. క్లీన్ ఎనర్జీ హైబ్రీడ్ ట్వెల్వ్ లిమిటెడ్ అనంతపురం జిల్లా రూ.779 కోట్ల పెట్టుబడులు, 125 మందికి ఉద్యోగాలు
4. క్లీన్ ఎనర్జీ హైబ్రీడ్ థర్టీన్ లిమిటెడ్ అనంతపురం జిల్లా రూ.779 కోట్ల పెట్టుబడులు 125 మందికి ఉద్యోగాలు
5. అదాని హైడ్రో ఎనర్జీ ఎలెవెన్ కడప జిల్లాలో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ రూ. 12,297 కోట్ల పెట్టుబడులు, 3375 మందికి ఉద్యోగాలు
6. యమాన్కో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తిరుపతి జిల్లాలో గ్రీన్ హైడ్రోజన్ రూ.9398 కోట్ల పెట్టుబడులు, 5820 మందికి ఉద్యోగాలు
7. అమృత శ్రీ బయో సీఎన్జీ లిమిటెడ్ విజయనగరం రూ.89 కోట్ల పెట్టుబడులు, 402 మందికి ఉద్యోగాలు
8. బాలాజీ బయోఎనర్జీ ఆర్గానిక్స్, నెల్లూరు జిల్లా రూ.59 కోట్ల పెట్టుబడులు, 335 మందికి ఉద్యోగాలు
9. హెచ్ పీసీఎల్ రెన్యూబుల్ గ్రీన్ ఎనర్జీ, ఏలూరు జిల్లా రూ.100 కోట్ల పెట్టుబడులు, 150 మందికి ఉద్యోగాలు
10. ఎనర్జియా బయో ఫ్యూయల్స్ తిరుపతి జిల్లాలో సీబీజీ ప్లాంట్ రూ.59 కోట్ల పెట్టుబడులు, 335 మందికి ఉద్యోగాలు
11. విభా బయో ఫ్యూయల్స్ తూర్పుగోదావరి జిల్లా రూ.67 కోట్ల పెట్టుబడులు, 110 మందికి ఉద్యోగాలు
12. ఐఓసీ జీపీఎస్ రెన్యువబుల్స్ ఎన్టీఆర్ జిల్లాలో సీబీజీ ప్లాంట్ రూ.120 కోట్లు పెట్టుబడులు, 200 మందికి ఉద్యోగాలు,
13. డెల్టా బయోగ్యాస్ పలనాడు జిల్లా రూ. 100 కోట్లు పెట్టుబడులు, 750 మందికి ఉద్యోగాలు

**ఐటీ**

14. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ విశాఖలో డేటాసెంటర్ ఏర్పాటు రూ.1,08,010 కోట్ల పెట్టుబడి, 1000 మందికి ఉద్యోగాలు
15. క్యారియర్ ఎయిర్ కండిషనింగ్, తిరుపతి జిల్లాలో బల్క్ చిల్లర్స్ తయారీ రూ.863 కోట్ల పెట్టుబడులు, 721 మందికి ఉద్యోగాలు.
16. ఎన్ఎస్టీఎల్ డీఆర్డీఓ, అమరావతి క్వాంటం వ్యాలీ రూ.22.5 కోట్ల పెట్టుబడి, 20 మందికి ఉద్యోగాలు

**ఫుడ్ ప్రాసెసింగ్**

17. స్నేహా ఫార్మ్స్ లిమిటెడ్ అనంతపురం, అన్నమయ్య జిల్లాలు, రూ,277.94 కోట్ల పెట్టుబడులు, 435 మందికి ఉద్యోగాలు

**పరిశ్రమలు**

18. గ్రైడోన్ ఎనర్జీ లిమిటెడ్, కర్నూలు జిల్లా, రూ.3149 కోట్ల పెట్టుబడులు, 320 ఉద్యోగాలు
19. అపోలో టైర్స్ , తిరుపతి జిల్లా, శ్రీసిటీ రూ,6100 కోట్లు పెట్టుబడులు, 1000 మందికి ఉద్యోగాలు
20. ఇంటర్నేషనల్ ఫ్లేవర్స్, ఫ్రాగ్రెన్సెస్ ఇఫ్కో సెజ్ నెల్లూరు, రూ.3153 కోట్ల పెట్టుబడులు, 172 మందికి ఉద్యోగాలు
21. రాయల్ ఎన్ ఫీల్డ్ , తిరుపతి జిల్లా, రూ.2508 కోట్ల పెట్టుబడులు, 3 వేల మందికి ఉద్యోగాలు
22. చెట్టినాడ్ సిమెంట్స్ , పలనాడు జిల్లా, రూ.1340 కోట్లు పెట్టుబడులు, 360 మందికి ఉద్యోగాలు
23. ఏఏకె సౌత్ ఈస్ట్ ఇండియా కాకినాడ జిల్లా, రూ.171.52 కోట్ల పెట్టుబడులు, 102 మందికి ఉద్యోగాలు
24. ఐటీసీ లిమిటెడ్, గుంటూరు జిల్లా రూ.51.65 కోట్ల పెట్టుబడులు, 50 మందికి ఉద్యోగాలు
25. హ్యాంగ్యో ఐస్ క్రీమ్స్ తిరుపతి జిల్లా రూ.74.49 కోట్ల పెట్టుబడులు, 110 మందికి ఉద్యోగాలు.

# అలా చేస్తే కేసులు వాపస్: మంగ్లీకి
# న్యాయవాది సుబ్బారావు కీలక సూచన

మైక్రోఫైనాన్స్ కేసులో గాయని మంగ్లీకి న్యాయవాది సుబ్బారావు కీలక సూచన చేశారు. ఈ కేసులోని బాధితులకు మంగ్లీ, ఆమె సోదరుడు డబ్బులు చెల్లిస్తే కేసులు వాపస్ తీసుకోవడానికి తాము సిద్ధమని స్పష్టం చేశారు. మైక్రోఫైనాన్స్ కేసులో మంగ్లీ ప్రతిసారి తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగ్లీతో పాటు ఆమె సోదరుడు శివపై గద్వాల్, గచ్చిబౌలి, నల్గొండలలో కేసులు ఉన్నాయని తెలిపారు.

ఈ కేసులకు సంబంధించి వారు ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. మైక్రోఫైనాన్స్ కేసులో బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని తాము డీజీపీ సీవీ ఆనంద్‌ను కలిసినట్లు తెలిపారు. అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కూడా కలుస్తామని అన్నారు. బాధితులకు న్యాయం జరగాలని ఆయన తెలిపారు.మైక్రోఫైనాన్స్ పేరిట అధిక లాభాలు వస్తాయని నమ్మించి మంగ్లీ, ఆమె సోదరుడు సహా మరికొంతమంది కోట్లాది రూపాయల మోసగించారని పలువురు బాధితులు సికింద్రాబాద్‌కు చెందిన న్యాయవాది సుబ్బారావును కలిశారు.

ఈ విషయం తెలుసుకోవడానికి సుబ్బారావు సంప్రదించగా, మంగ్లీ బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపిస్తూ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మరోవైపు, తనపై దుష్ప్రచారం చేయడం ద్వారా న్యాయవాది సుబ్బారావు ప్రాచుర్యం పొందాలనుకుంటున్నారని మంగ్లీ అదే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# తమిళ రాజకీయాల్లో కొత్త ట్విస్ట్! విజయ్‌కు పోటీగా డీఎంకే, అన్నాడీఎంకే కలుస్తాయా?

- మొదటి పేజి తరువాయి

అన్నాడీఎంకే వర్గాలు ధ్రువీకరించాయని, కానీ ఫలితం ఏమిటనేది తెలియరాలేదని తెలుస్తోంది.అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే 59, అన్నాడీఎంకే 47 స్థానాలు గెలుచుకున్నాయి. అయితే ఈ రెండు పార్టీలు కలిసినా (106 స్థానాలు) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కావాల్సిన సంఖ్యా బలం ఉండదు. ఈ కూటమికి వీసీకే వంటి చిన్న పార్టీల మద్దతు అవసరం. అయితే అన్నాడీఎంకేతో తమకు ఎలాంటి పొత్తు ఉండబోదని డీఎంకే అధికార ప్రతినిధి ఎ.శరవణన్ తెలిపారు.

# ఇరాన్ సహకరించకుంటే మళ్లీ బాంబుదాడులు మొదలవుతాయి

- మొదటి పేజి తరువాయి

జలసంధి తెరుచుకుంటుందని పేర్కొన్నారు.ఇరాన్ నుంచి సహకారం లేకుంటే మునుపటి కంటే భీకరస్థాయిలో, మరింత తీవ్రతతో బాంబు దాడులు ఉంటాయని హెచ్చరించారు. యుద్ధం ముగింపు దిశగా ఒప్పందం కుదిరే అవకాశాలు ఉన్నాయని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. యుద్ధాన్ని ముగించేందుకు, మరింత వివరణాత్మక అణు చర్చల కోసం ఫ్రేమ్ వర్క్‌ను ఏర్పాటు చేసేందుకు రెండు దేశాలు ఓ ఒప్పందానికి చేరువవుతున్నాయంటూ అమెరికా మీడియా సంస్థ ఒకటి తెలిపింది. అణు కార్యక్రమాల తాత్కాలిక నిషేధానికి ఇరాన్ ముందుకు రావడం, హార్ముజ్ జలసంధిలో ఆంక్షలు ఎత్తివేయడం, ఇరాన్‌కు చెందిన నిధుల విడుదలకు అమెరికా అంగీకరించడం వంటివి ఈ ఒప్పందంలో ఉన్నట్లు వార్తలు వచ్చాయి.

# మెదక్‌లో దారుణం.. పసికందును రూ.1.50 లక్షలకు అమ్మేసిన నర్సు

మెదక్ జిల్లాలో అత్యంత దారుణమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. పుట్టిన పసికందు చనిపోయిందని తల్లిని నమ్మించిన ఓ నర్సు, ఆ శిశువును రూ.1.50 లక్షలకు విక్రయించింది. ఈ అమానవీయ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

**అసలేం జరిగిందంటే..!**

పాపన్నపేట మండలం లక్ష్మీనగర్ తండాకు చెందిన నస్రా ఫాతిమా సికింద్రాబాద్‌లోని మౌలాలిలో నివసిస్తోంది. ఏడు నెలల గర్భిణిగా ఉన్న ఆమె, ఇటీవల తన అత్తగారింటికి వెళ్లేందుకు మెదక్‌కు వచ్చింది. బస్టాండ్‌లో ఆమె చేతిలోని చిప్స్ ప్యాకెట్‌ను చూసిన కోతులు ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ ఘటనతో భయపడిపోయిన ఆమెను స్నేహితురాలు స్థానిక ఆసుపత్రికి తరలించారు.అక్కడ వైద్యులు శస్త్రచికిత్స చేయగా, ఫాతిమా ఓ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అయితే, అదే ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న అక్తరీ బేగం, పుట్టిన పాప చనిపోయిందని ఫాతిమాను నమ్మించింది. నర్సు మాటలు నిజమని భావించిన ఫాతిమా, తీవ్ర దుఃఖంతో మూడు రోజుల తర్వాత ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్లింది.

అయితే, ఐదు రోజుల తర్వాత ఓ వ్యక్తి ద్వారా తన పాప బతికే ఉందని ఫాతిమాకు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన బాధితురాలు వెంటనే పోలీసులను ఆశ్రయించి, నర్సు అక్తరీ బేగంపై ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# విమర్శించడం తప్ప పేర్ని నానికి బందరు ప్రయోజనాలు పట్టవు

బందరు (మచిలీపట్నం) చరిత్ర తిరగరాసేలా నగరాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర ధీమా వ్యక్తం చేశారు. ఈరోజు బందరులో తాగునీటి పైపులైన్లు, డీడబ్ల్యూఎమ్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఆయన... ప్రతి ప్రాంతానికి రోడ్లు, తాగునీటి సౌకర్యాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం మున్సిపాలిటీ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కేవలం విమర్శలకే పరిమితమైన మాజీ మంత్రి పేర్ని నానికి బందరు ప్రయోజనాలు పట్టవని మండిపడ్డారు. అభివృద్ధి పనులను ఎవరైనా అడ్డుకోవాలని చూస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.ప్రధానంగా తాగునీటి సమస్య పరిష్కారానికి రూ. 28 లక్షలతో పనులు చేపడుతున్నామని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో బందరు రూపురేఖలు మారుస్తామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందకుండా చేసిందని, కరగ్రహారం లేఅవుట్ పేరుతో భూములను తక్కువకు కొని ప్రభుత్వానికి ఎక్కువ ధరకు అమ్మి దోచుకున్నారని ఆరోపించారు. ఇనుము దొంగతనంపై పేర్ని నాని చేస్తున్న ఆరోపణలను కొట్టిపారేస్తూ, నిరుపయోగంగా ఉన్న ఇనుమును ప్రజల అవసరాల కోసం వినియోగించడంలో తప్పులేదని మంత్రి స్పష్టం చేశారు.

# రైతులకు వేగంగా విత్తన సరఫరా చేయాలి

- మొదటి పేజి తరువాయి

కొనుగోలు చేసేలా చూడాలని అన్నారు. అరటి, ఆయిల్ పామ్, మిర్చి, కోకో లాంటి పంటలకు సంబంధించి ధరల సమస్య లేదని రైతులకు మంచి ధర లభిస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సీజన్ కంటే ముందే రాష్ట్రంలోని నీటి వనరుల్లో ఫిష్ సీడ్ ను సరఫరా చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వచ్చే పంట సీజన్ కు 7.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు. నాఫెడ్ నుంచి మినుములు ఇతర వాణిజ్య పంటల్ని కొనుగోలు చేస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్యమంత్రికి వివరించారు. పీఎండీఎస్ పథకం ద్వారా తక్కువ యూరియా వినియోగానికి ఇచ్చే ప్రోత్సాహకం పై కేంద్రంతో మాట్లాడాలని వారికి సూచించారు. మదనపల్లె లో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు కానుందని ముఖ్యమంత్రి అన్నారు.

- మిగతా 2లో


పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం




# కలవళ్ళలో డిఏ జాడెక్కడ?

### ఎప్పుడు వస్తాడో.. ఎప్పుడు పోతాడో ఎవరికి తెలియదు !
### ఎంపీడీఓ మందలించిన తీరు మారని వైనం -సచివాలయంలో సేవలు ఉక్కిరి బిక్కిరి
### కరెంట్ బిల్లు కట్టాలన్న కష్టాలు తప్పడం లేదంటున్న ప్రజలు

**వలేటివారిపాలెం, పెన్ పవర్ మే 06**



కలవల్ల గ్రామ సచివాలయంలో సేవలు రోజురోజుకు అందని ద్రాక్షాల మారుతున్నాయి. ఏ చిన్న పని కావాలన్నా డిజిటల్ అసిస్టెంట్ లేనిదే పని జరగటం లేదు. డిజిటల్ అసిస్టెంట్ ఎప్పుడు వస్తాడో.. ఎప్పుడు పోతాడో ఎవరికి తెలియని పరిస్థితి అక్కడ నెలకొంది. ఇదేంటని ఎవరైనా ప్రశ్నిస్తే ఒంగోలు నుంచి రావాలి గా ..! అని పొంతన లేని సమాధానం ఇస్తున్నట్లు ప్రజలు చెబుతున్నారు. పలు సమస్యలపై సచివాలయానికి వచ్చిన ప్రజలు డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడంతో వెనుదిరగాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే బుధవారం పెన్ పవర్ కలవళ్ళ గ్రామంలోని సచివాలయాన్ని పరిశీలించారు. ఉదయం 11 గంటలు దాటిన సచివాలయానికి ఇంకా నలుగురు ఉద్యోగులు రాలేదు. ప్రజలు మాత్రం తమ సమస్యల్ని చెప్పుకోవడానికి వచ్చి వేచి చూసి ఇక చేసేది ఏమి లేక వెనుదిరిగి వెళ్లిపోయారు. గ్రామంలోని ప్రజలను పెన్ పవర్ విచారణ చేయగా డిజిటల్ అసిస్టెంట్ ఎప్పుడు వస్తాడో ఎప్పుడు పోతాడో ఎవరికి తెలియదని చెప్పుకొచ్చారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ మొఖం చూసి మూడు నెలల కావస్తోందని , సెక్రటరీ ఇంచార్జ్ కావడంలో అప్పుడప్పుడు వచ్చి పోతున్నారన్నారు. జూనియర్ లైన్ మెన్ ఆయన పనికోసి ఎక్కడో ఉంటారని చెప్పారు. ఎవరితో ఏం పని ఉన్నా సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ లేనిదే ఏ పని జరగడం లేదని చెబుతున్నారు. కరెంట్ బిల్లు కట్టాలన్న కష్టాలు తప్పడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ అసిస్టెంట్ తనకు ఇష్టమైనప్పుడు వచ్చి ఇష్టమైనప్పుడు వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎంపీడీఓ శంకరరావు సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సమయపాల పాటించాలని సచివాలయాన్ని తనిఖీ చేసి ఉద్యోగులను ఇంతకు ముందు హెచ్చరించారు. తీరు మార్చుకోకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పినా ప్రయోజనం శూన్యం అంటున్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఉన్నతాధికారులు చెబుతున్నా వారి మాటలు నోటి మాటలకు కాగితాలకే పరిమితం తప్ప ఇక్కడ మాత్రం తీరు మారడం లేదని అంటున్నారు. ఎవరైనా ఇదేంటని ప్రశ్నిస్తే మేము చాలా దూరం నుంచి రావాలి కదా ... వచ్చిన వాళ్ళు ఉండలేరా... అని అడ్డదిడ్డ సమాధానాలతో మాట దాట వేస్తున్నారని చెబుతున్నారు. ప్రజలు పలు సమస్యలపై వచ్చి ఇంక చేసేదేమి లేక వెనుతిరగాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సచివాలయంలో డిఏ సక్రమంగా విధులకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని లేదంటే కొత్తవారిని నియమింపజేయాలని కోరుతున్నారు.

**ఎంపీడీఓ వివరణ ..:** ఈ విషయంపై ఎంపీడీఓ శంకరరావు ను పెన్ పవర్ వివరణ కోరగా డిజిటల్ అసిస్టెంట్ సక్రమంగా విధులకు హాజరు కావడం లేదనేది వాస్తవం. తీరు మార్చుకొని సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎన్నో సార్లు చెప్పాను. కానీ అతని తీరు మారడం లేదు. కలవళ్ళ డిజిటల్ అసిస్టెంట్ పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# అన్నం పెట్టే రైతన్నలపై ప్రభుత్వం చిన్నచూపు

### అకాల వర్షంతో నష్ట పోయిన రైతన్నలను ఆదు కోవడంలో కూటమి ప్రభుత్వం విఫలం
### నష్టపోయిన బొప్పాయి పంటను పరిశీలించిన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్





**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ మే 6**

ఆరుగాలం కష్టపడి భూమి తల్లిని నమ్ముకొని పంటలు పండించిన అన్నం పెట్టే రైతన్నలు అన్నామో రామచంద్ర అంటు కన్నీళ్ల పర్వంతం అవుతున్న కూటమి ప్రభుత్వం చలించడం లేదని వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం పట్టణంలోని కొత్తపల్లి గ్రామ సమీపంలో అకాల వర్షాలకు నష్టపోయిన బొప్పాయి పంట పొలాలను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు.వైస్సార్సీపీ నాయకులు కార్యకర్తలతో బొప్పాయి పంట పొలంలో కలియ తిరిగారు. ఈ సందర్బంగా బొప్పాయి నష్టంపై వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యం పై ఆగ్రహం వ్యక్తం చేసి మండిపడ్డారు. తుఫాను కారణంగా రైతులు నష్టపోతే నేటివరకు పంట పొలాలు పరిశీలించకుండా, రైతులు ఎంతవరకు నష్టపోయారో అంచనా వేయకుండా చోద్యం చూస్తున్నారా, మానవత్వం చచ్చిందా అంటు కూటమి ప్రభుత్వం పై నిప్పులు చెరిగారు. అమరావతి ఆవకాయ అంటు రైతన్నల పేరు చెప్పి పబ్బం గడుపుకోవడం కాదని, అన్నం పెట్టే రైతన్నల బాగుకోసం వారి సంక్షేమం కోసం పాటు పడాలని అన్నారు.రైతులు కష్ట పడి పండించిన పంటలకు కనీస మద్దతు ధర ప్రభుత్వం కల్పించక పోతే రైతులు అప్పులపాలు కాక, ఆత్మహత్య లకు పాల్పడకుండా ఏం చేస్తారని, ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో మోసపురితహామీలు గుప్పించి గెలిచి గద్దెనెక్కినాకా విస్మరించడం దుర్మార్గమని, రైతన్నల సంక్షేమం కోసం రైతన్నల నాగలి బ్రతకడం కోసం వైస్సార్సీపీ ఎల్లప్పుడూ పోరాడుతుందని అన్నారు. వ్యవసాయ అధికారులను బొప్పాయి పంట పొలాలకు పిలిపించి పంట నష్టాన్ని అంచనా వేసి తక్షణ సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గనాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### రెవెన్యూ వివాదాల పరిష్కారానికి అధికారుల గ్రామ సందర్శన
### తహశీల్దార్ ఆంజనేయరెడ్డి
### నేడు కొంగలవీడులో గ్రామ సభ



**గిద్దలూరు, పెన్ పవర్, మే 6**

ఏండ్లుగా వివాదాల నడుమ అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ శాఖ నడుం బిగించింది. మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం" ఒక నెల - ఒక గ్రామం - నాలుగు పర్యటనలు పేరిట ప్రతిష్టాత్మకంగా కార్యాచరణ చేపట్టినట్లు గిద్దలూరు తహసీల్దారు ఎం. ఆంజనేయరెడ్డి తెలిపారు. అన్ని గ్రామాల్లో దశల వారీగా ప్రతి గురువారం గ్రామ సభలు నిర్వహించి సమస్యల వినతులను స్వీకరించి, పరిశీలించి పరిష్కారం చూపుతారు.గురువారం ప్రభుత్వ సాధారణ సెలవు ఉన్నట్లయితే మరుసటి పనిదినమే గ్రామసభ నిర్వహిస్తారు. గిద్దలూరు మండలంలోని తొలి పర్యటనగా కొంగలవీడులో ఈ నెల 7వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఒక ప్రకటనలో తెలిపారు.

# ముస్లిం పేద విద్యార్థినీ విద్యార్థులకు వరం

### - తాలీం ఏ హునర్ - తెదేపా మైనారిటీ రాష్ట్ర నేత హనీఫ్ ఖాన్
### - తాలీం ఏ హునర్ పోస్టర్ ఆవిష్కరణ

**స్టాఫ్ రిపోర్టంగ్ పెన్ పవర్, ఒంగోలు మే 06**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో పేద ముస్లిం విద్యార్థినీ విద్యార్థులకు ఇంటర్మీడియట్ కార్పొరేట్ ఉచిత విద్యను అందించడమే ధ్యేయంగా తాలీం ఏ హునర్ టాలెంట్ టెస్ట్ నిర్వహించడం ముస్లింల సంక్షేమం కోసం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషిని ముస్లిం సమాజం అంతా అభినందించి అండగా నిలవాలని తెలుగుదేశం పార్టీ మైనారిటీ సెల్ రాష్ట్ర నాయకులు పఠాన్ హనీఫ్ ఖాన్ కోరారు. బుధవారం స్థానిక మీడియా కెమెరామెన్ అసోసియేషన్ భవనంలో ప్రకాశం జిల్లా వక్ఫ్ బోర్డ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా హనీఫ్ ఖాన్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తోటే ముస్లిముల సంక్షేమం, సామాజిక, ఆర్థిక అభివృద్ధి ప్రారంభమైందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ హాజీ అబ్దుల్ అజీజ్ రూపకల్పన తో పేద ముస్లిం విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా ఇంటర్మీడియట్ విద్యను అందించడమే లక్ష్యంగా 10వ తరగతిలో 450 పైగా మార్కులు సాధించి తెల్ల రేషన్ కార్డు దారులైన వారికి టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ పథకం ద్వారా కార్పొరేట్ కళాశాలలో 100% ఉచిత ఇంటర్మీడియట్ రెసిడెన్షియల్ విద్యతోపాటు ఐఐటి జేఈఈ నీట్ ఎంసెట్ లకు ఉచిత శిక్షణ అందజేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ ఆధ్వర్యంలో హాస్టల్, భోజన సదుపాయం, పుస్తకాలు పూర్తిగా ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఆడపిల్లలకు 33% ప్రత్యేక రిజర్వేషన్ కల్పించబడుతుందని తెలిపారు. నిరుపేద ముస్లింలు ఉన్నత స్థానంలో ఉండాలంటే వారి భవిష్యత్తుకు భరోసా ఇచ్చేది ఒక్క విద్య మాత్రమే అని భావించి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫారుక్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల గౌరవ సలహాదారులు ఎం.ఏ.షరీఫ్ లు తాలీం ఏ హునర్ కార్యక్రమానికి తమ సంపూర్ణ మద్దతును, ప్రోత్సాహాన్ని ఇచ్చారని తెలిపారు. జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ అహ్మద్ భాష మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం పేద విద్యార్థి విద్యార్థులకు ఒక గొప్ప వరాన్ని ఇచ్చిందని, చారిత్రాత్మక నిర్ణయంతో వందలాది మంది పేద విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించడానికి బంగారు బాట వేసిందని అన్నారు. అందులో భాగంగా రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ హాజీ అబ్దుల్ అజీజ్ తాలీం ఏ హునర్ కార్యక్రమాన్ని తీసుకొచ్చారని చెప్పారు. ఈ పథకం ద్వారా 2026- 27 సంవత్సరానికి గాను లో 250 మంది పేద ముస్లిం విద్యార్థినీ విద్యార్థులకు ఉచిత ఇంటర్మీడియట్ విద్య అందించడం జరుగుతుందని అన్నారు. పదవ తరగతిలో 450 పైగా మార్కులు సాధించిన ముస్లిం విద్యార్థిని విద్యార్థులు టాలెంట్ టెస్ట్ కు అర్హులుగా తెలిపారు. వారికి తప్పనిసరిగా వైట్ రేషన్ కార్డు ఉండాలని పేర్కొన్నారు. అలాంటివారు ఆన్ లైన్ పద్ధతిలో ఈనెల 06వ తేదీ నుండి 12వ తేదీ వరకు దరఖాస్తులు నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు నమోదు చేసుకున్న వారికి ఈనెల 17వ తేదీన ఆన్ లైన్ పద్ధతిలోనే టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందని ఫలితాలు కూడా ఆన్ లైన్ లో చూసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కొరకు ఒంగోలులోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా గల ప్రభుత్వ కార్యాలయాల సముదాయం (పాత రిమ్స్) లో ఉన్న ప్రకాశం జిల్లా వక్ఫ్ బోర్డు కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో ముందుగా తాలీం ఏ హునర్ కార్యక్రమం ప్రచార పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ పత్రిక సమావేశంలో వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ షేక్ సాదిక్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ టి. సుధాకర్, తెదేపా నాయకులు షేక్ అజీమున్నీసా, షేక్ కాలేషా బాబు, షేక్ జమీల్ అహ్మద్, పఠాన్ నజీర్ ఖాన్, షేక్ బషీర్ పాల్గొన్నారు.

# ఘనంగా మహానాడు భూమిపూజ

### -పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి







**కందుకూరు పెన్ పవర్, మే 6**

తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు ప్రతిఏటా ఘనంగా జరుపుకునే మహానాడు - 2026 పండుగ... ఈనెల 27,28,29 తేదీల్లో నెల్లూరు జిల్లా కొడవలూరు మండలంలో, జాతీయ రహదారి పక్కన కిసాన్ సెజ్ ప్రాంగణంలో జరగబోతోంది.మహానాడు వేదిక, ఇతర పనులకు సంబంధించిన భూమిపూజ కార్యక్రమం బుధవారం జరిగింది. నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులు బీద రవిచంద్ర , ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి , మంత్రి నారాయణ , సహచర శాసనసభ్యులతో కలిసి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులంతా ఒకరినొకరు సమన్వయం చేసుకుంటూ ఐకమత్యంతో, మహానాడును దిగ్విజయంగా నిర్వహిస్తామని వెల్లడించారు. కందుకూరు నియోజకవర్గం నుంచి వేలసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేస్తామని చెప్పారు.

# నల్లమడుగులో అంగరంగ వైభవంగా సీత రామ కళ్యాణ మహోత్సవం

**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 6**

మండలంలోని నల్లమడుగుల గ్రామంలో శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా రామాలయం దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో సీత రామ కళ్యాణ మహోత్సవ వేడుకలు బుధవారం అత్యంత భక్తి శ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామమంతా పండుగ శోభను సంతరించుకుని ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది. ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించగా, అనంతరం శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహాలను సుందరంగా పుష్పాలతో అలంకరించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో, తోరణాలతో అలంకరించడం భక్తులను ఆకట్టుకుంది. వేద పండితులు మంకాల శివప్రసాద్ శర్మ మంత్రోచ్చారణల మధ్య మేళ తాళాలతో సంప్రదాయ పద్ధతిలో సీత రామ కళ్యాణాన్ని నిర్వహించగా, భక్తులు హర్షధ్వానాలతో పాల్గొన్నారు.కళ్యాణోత్సవాన్ని దర్శించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సీతారాముల శిరస్సులపై అర్చకులు జిలకర బెల్లం ఉంచారు ఆ తర్వాత తాళిబొట్టుతో కూడిన మంగళసూత్రాన్ని రాముని తరపున అర్చకులు సీతమ్మకు అలంకరించారు మంగళసూత్ర



ధారణ తరువాత సీతమ్మ రామయ్య ల తల తలంబ్రాలు వేడుక జరిగింది సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించిన వేలాదిబంది భక్తులు శ్రీరామ నామస్మరణతో ఆలయ ప్రాంగణం భక్తి శ్రద్ధలతో కార్యక్రమాలలో



పాల్గొన్నారు ఈ సందర్భంగా అంబారపు వెంగళరెడ్డి కుమారుడు శ్రీనివాసరెడ్డి మౌనిక దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శ్రీరామనవమి సందర్భంగా సీతారామ కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు మహిళలు యువకులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సీతారాముల దివ్య కళ్యాణాన్ని తిలకించారు

# ప్రసూతి వైద్య సేవలపై..

### గాయత్రి ఆస్పత్రి వారి రాయితీ

### రూ.10వేలకే ప్రసూతి వైద్య సేవలు డాక్టర్ గాయత్రి

**గిద్దలూరు, పెన్ పవర్, మే 6**




గిద్దలూరు పట్టణంలో పది రూపాయల డాక్టర్ గా వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ బ్రహ్మానందరెడ్డి స్థాపించిన గాయత్రి ఆస్పత్రిలో మహిళలకు ప్రసూతి వైద్య సేవలు రాయితీపై అంది స్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు ప్రకటించాయి. సీనియర్ గైనకాలజిస్ట్, లాపరోస్కోపిక్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ గాయత్రి పర్యవేక్షణలో రాయితీ వైద్యం లభిస్తుంది. సాధారణ కాన్పులు, సిజేరియన్ ఆపరేషన్లు, లాపరోస్కోపిక్ ట్యూబెక్టమీ ఆపరేషన్లు ఈ రాయితీ సేవల్లో ఉన్నాయి. ఆపరేషన్, రూమ్ రెంట్ మరియు మందుల ఖర్చులతో కలిపి కేవలం రూ.10 వేలకే సేవలందించనున్నట్లు పేర్కొన్నారు. గిద్దలూరు నియోజకవర్గ పరిధిలోని మారుమూల పట్టణ, గ్రామీణ గర్భిణీ స్త్రీలు సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ గాయత్రి కోరారు. డాక్టర్ బ్రహానందరెడ్డి రూ 10 ల డాక్టరుగా పేరుగడించి, గ్రామీణప్రాంతలో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. వైద్య శిబిరాల్లో ఉచితంగా మందులు కూడా అందిస్తారు. మానవసేవే మాధవ సేవ అనే నమ్మకంతో ముందుకు సాగుతున్నారు. రాయితీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కోరారు.

# ఢిల్లీలో బీజేపీ నాయకులు

### హరిశరన్ దేవగన్‌ను కలసిన గిద్దలూరు బిజెపి నాయకుడు

### అప్పిశెట్టి ఉదయ్ శంకర్



**గిద్దలూరు పెన్ పవర్ మే 6**

భారతీయ జనతా పార్టీ గిద్దలూరు బిజెపి నాయకుడు అప్పిశెట్టి ఉదయ్ శంకర్ ఢిల్లీ లో బీజేపీ ప్రముఖ నాయకులు హరిశరణ్ దేవగన్‌ను ఆయన కార్యాలయం లో మర్యాద పూర్వకంగా కలసి గిద్దలూరు నియోజక వర్గంలో ఎన్ డి ఏ ప్రభుత్వం ప్రజల కు అందిస్తున్న పథకాలను, బీజేపీ పార్టీ విస్తరణ,పార్టీ లో ఇతర పార్టీల నేతల చేరికలు బూత్ కమిటీ లు నియామకం శక్తి కేంద్రాల నియామకం,రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల గురించి ఇటీవల దేశము లో జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికలలో బీజేపీ బెంగాల్,అస్సాం,పుదుచ్చేరి రాష్ట్రాల లో ఘన విజయం గురించి చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా హరిశరన్ దేవగన్ గిద్దలూరు అసెంబ్లీ కి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను త్వరి తగతిన శాంక్షన్ చేయడం లో తన సహకారము ఉంటుంది అని తెలియ చేశారు.ఎప్పుడూ అవసరం ఉన్న తనను కలవండి అని తెలియ చేశారు.

# నిరుద్యోగులకు ఏపీ బి.సి. స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ,

**గిద్దలూరు పెన్ పవర్ మే 6**



ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని నిరుద్యోగ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ బి.సి. సంక్షేమ శాఖ కీలక నిర్ణయం తీసుకుందని, ఒంగోలులోని ఏపీ బి.సి. స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆర్ఆర్ బి, అసిస్టెంట్ లోకో పైలట్ , ఆర్ఆర్ బి గ్రూప్–డి , ఏపీ హైకోర్టు ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు గిద్దలూరు బి.సి. సహాయ సంక్షేమాధికారి దమ్మాల హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. గిద్దలూరు ప్రాంత పరిధిలోని అర్హులైన బీసీ, ఎస్సి, ఎస్టీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చని, అలాగే నమోదు చేసుకున్న వారిలో ఎంపిక చేసిన 100 మంది అభ్యర్థులకు 2 నెలలు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందించబడుతుందని, ఎంపికైన వారికి ఈ నెల 25వ తేదీ నుండి తరగతులు ప్రారంభమవుతాయని, అభ్యర్థులు తమ బయోడేటాతో పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ సర్టిఫికేట్ల నకళ్లు, కుల , ఆదాయ ధ్రువీకరణ పత్రాలు (తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. లక్ష లోపు ఉండాలి), ఆధార్ కార్డు నకలు, బ్యాంక్ పాస్ బుక్ నకలు, ఆర్ఆర్ బి గ్రూప్–డి, ఏపీ హైకోర్టు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న ఆన్ లైన్ అప్లికేషన్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో ఈ నెల 20వ తేదీ లోపు ఒంగోలు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా ఉన్న గవర్నమెంట్ ఆఫీస్ కాంప్లెక్స్‌లోని ఏపీ బిసి స్టడీ సర్కిల్ కార్యాలయంలో సమర్పించాలని హరి ప్రసాద్ కోరారు. కావున ఈ అవకాశాన్ని గిద్దలూరు ప్రాంత నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు సెల్ 9849655379 నంబరును సంప్రదించాలని కోరారు.

# పట్టభద్రుల కలలకు పట్టం కట్టిన ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల

## -ఘనంగా తొలి గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**కందుకూరు పెన్ పవర్, మే 6**






ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో (అటోనమస్) తొలి గ్రాడ్యుయేషన్ డే వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థుల జీవితంలో చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిన ఈ వేడుకలో పీజీ పట్టభద్రులకు డిగ్రీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. గ్రాడ్యుయేషన్ గౌన్లలో మెరిసిపోయిన విద్యార్థులు ఆనందోత్సాహాల మధ్య కళాశాల ఆవరణలో సందడి చేశారు.కార్యక్రమానికి కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కె. విజయ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై పట్టభద్రులకు డిగ్రీ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య అనేది ఉద్యోగానికి మాత్రమే కాదు వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే శక్తి అని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో అత్యాధునిక ల్యాబ్‌లు, డిజిటల్ క్లాస్‌రూమ్స్, ఇండస్ట్రీ ఓరియెంటెడ్ ట్రైనింగ్, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, మెరుగైన ప్లేస్‌మెంట్ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. యువత సాంకేతిక పరిజ్ఞానంతో పాటు నైతిక విలువలను కూడా అలవరచుకొని సమాజానికి ఉపయోగపడే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ కె. రామయ్య ఆశయాలను స్మరించుకుంటూ ఈ తొలి గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఆయనకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించగా సభలో భావోద్వేగ వాతావరణం నెలకొంది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. హెచ్. రవి కుమార్ పట్టభద్రులతో గ్రాడ్యుయేషన్ ప్రతిజ్ఞ చేయించారు. సమాజ శ్రేయస్సు కోసం మా విద్యను వినియోగిస్తాం అంటూ విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమం మొత్తం అత్యంత క్రమబద్ధంగా, హుందాగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వి. హరిబాబు, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ షేక్ దస్తగిరి, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొని పట్టభద్రులను అభినందించారు. అన్ని విభాగాల సిబ్బంది సమిష్టి కృషితో వేడుక విజయవంతమైంది. అనంతరం కళాశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన విందు భోజనం అందరినీ ఆకట్టుకుంది. తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులు ఫోటోలు దిగుతూ జీవితాంతం గుర్తుండిపోయే మధుర క్షణాలను ఆస్వాదించారు. కళాశాల ప్రాంగణం మొత్తం ఆనందోత్సాహాలతో కళకళలాడింది.

# రైతుల సమస్యల పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వ ఆశయం



**కొమరోలు పెన్ పవర్ మే 6**

రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వన్ మంత్ ,వన్ విలేజ్, ఫోర్ విజిట్ అనే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నదని కొమరోలు తాసిల్దార్ భాగ్యలక్ష్మి తెలిపారు. బుధవారం కొమరోలు తాసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తాసిల్దార్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు ప్రభుత్వము విడుదల చేసిన మార్గదర్శకాలను మండలంలో అమలు జరుపుతున్నట్లుగా ఆమె చెప్పారు. వన్ మంత్, వన్ విలేజ్, ఫోర్ విజిట్స్ కార్యక్రమాలను మండలంలో సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లుగా ఆమె చెప్పారు. మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని ఆ గ్రామంలో వరుసగా నాలుగు వారాలపాటు నాలుగు విడతలుగా ప్రత్యేక రెవెన్యూ గ్రామ సందర్శనలు నిర్వహించబడతాయని, గ్రామస్తుల భూ, రెవెన్యూ సంబంధిత సమస్యలను గ్రామంలోనే అర్జీలు రూపంలో స్వీకరించి, పరిశీలించి, చట్టబద్ధంగా పరిష్కరించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. రీ సర్వే గ్రామాలు ,ఎక్కువ సంఖ్యలో రెవెన్యూ ఫిర్యాదులు ఎక్కువగా పెండింగ్లో ఉన్న గ్రామాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లుగా ఆమె చెప్పారు. సదరు కార్యక్రమంలో తాసిల్దార్, ఎంపీడీవో, మండల సర్వేయర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ తదితర అధికారులు తప్పనిసరిగా పాల్గొని రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని అన్నారు. సదరు కార్యక్రమాలలో భాగంగా మొదటి సందర్శనలో ఫిర్యాదుల స్వీకరణ, గ్రామ భూ రికార్డుల పరిశీలన, రెండవ సందర్శనలో ఫీల్డ్ వెరిఫికేషన్ ,విచారణ, మూడవ సందర్శనలో సమస్యల పరిష్కారం, ఉత్తర్వులు జారీ ,నాలుగవ సందర్శనలో గ్రామసభ నిర్వహించి, పరిష్కరించిన సమస్యలు వివరాలు ప్రజా ప్రకటన చేపడతామని ఆమె తెలిపారు. సదరు కార్యక్రమాలు గురువారం నుంచి మండలంలో సూరి వారి పల్లి గ్రామం నుంచి ప్రారంభమవుకానున్నాయని, కావున రైతులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులకు సహకరించాలని ఆమె కోరారు.

# ఏ పి టి ఎఫ్ నూతన జిల్లా కార్యవర్గం ఎన్నిక

**గిద్దలూరు పెన్ పవర్ మే 6**




స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మార్కాపురం జిల్లా ఏ పీ టీ ఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు రాచేటి సంజీవ్ కుమార్ అధ్యక్షతన , రాష్ట్ర కార్యదర్శి కే వి జి కీర్తి ఎన్నికల అధికారిగా ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి హృదయ రాజు పర్యవేక్షణలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు . ముఖ్య అతిథి హృదయ రాజు మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న నాలుగు విడతల డి ఏ లను విడుదల చేస్తూ నూతన పిఆర్సి కమిటీని ఏర్పాటు చేయాలని వెంటనే 30శాతం ఐ ఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు . రాష్ట్ర కార్యదర్శి శ్రీ కే.వీ.జీ. కీర్తి మాట్లాడుతూ ఉద్యోగుల పట్ల ఉపాధ్యాయుల పట్ల ఉదాసీన వైఖరి విడనాడకపోతే మరో బి ఆర్ టి ఎస్ ఉద్యమాన్ని చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. జిల్లా గౌరవ అధ్యక్షులు ఎన్నికైన ఎస్ ఎచ్ కబీర్ మాట్లాడుతూ విద్యారంగాన్ని పరిరక్షించాలని ఉపాధ్యాయులపై ఏ పి పి ల భారాన్ని తగ్గించి బోధనపై దృష్టి సారించి, అనవసరపు పని ఒత్తిడిని తగ్గించాలని సూచించారు. జిల్లా అధ్యక్షులు ఆర్ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ సిపిఎస్ రద్దు గురించి సరైన నిర్ణయాన్ని తక్షణం తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన టి పాండురంగ స్వామి మాట్లాడుతూ కారుణ్య నియమకాలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు వై శ్రీనివాసులు మాట్లాడుతూ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఒక పూర్తి రోజు నిర్వహించేలా ,ఆప్షనల్ హాలిడేస్ ను మొత్తంగా వినియోగించుకునేలా ఉత్తర్వులు విడుదల చేయాలని కోరారు. జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో నెంబర్ 57 ను అమలు చేసి సుమారుగా పదివేల మంది 2002, 2003 డిఎస్సి ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని వక్తలు డిమాండ్ చేశారు ఏ ఐ ఎఫ్ ఆర్ టి ఈ రాష్ట్ర కౌన్సిలర్ సి పి వి సుబ్బారావు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం కూడా ప్రభుత్వ బాధ్యత అని గవర్నమెంట్ పాఠశాలను బలోపేతం చేయడానికి నూతన మార్గాలు అన్వేషించాలని సూచించారు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఆర్ సంజీవ్ కుమార్ , ప్రధాన కార్యదర్శిగా టి పాండురంగ స్వామి గౌరవ అధ్యక్షులుగా ఎస్ హెచ్ కబీర్ , అసోసియేట్ ప్రెసిడెంట్ గా ఉపాధ్యక్షులుగా ఎస్. సి. కుమార్, ఎస్. వి. సుభాషిని డిజె ప్రభాకర్, 1. అడిషనల్ సెక్రటరీగా ఎస్కే మహమ్మద్ రఫీ, కార్యదర్శులుగా ఎన్. ఏలియా, డి రూపుల్ నాయక్, డి. వెంకటేశ్వర్లు, జి. పాండు, ఎం. కృష్ణమూర్తి ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# కసినేపల్లె గ్రామంలో బండలాగుడు పందెం పోటీలను ప్రారంభించిన గిద్దలూరు ఎమ్మెల్యే తనయుడు ముత్తుముల దివ్యేష్ రెడ్డి





**కొమరోలు పెన్ పవర్ మే 6**

కొమరోలు మండలం కసినేపల్లె గ్రామంలో బుధవారం ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి బండలాగుడు పందెం పోటీలను గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి తనయుడు ముత్తుముల దివ్యేష్ రెడ్డి లాంచనంగా ప్రారంభించారు. కసినేపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు 4వ తేదీ నుంచి ఆరవ తేదీ వరకు ఘనంగా నిర్వహించారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని ఆ బుధవారం ఆ గ్రామంలో రాష్ట్రస్థాయి బండలాగుడు పందెం పోటీలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు .ఆ కార్యక్రమాలకు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డిని ఆహ్వానించగా కొన్ని కారణాలవల్ల శాసనసభ్యులు అశోక్ రెడ్డి హాజరు కాలేక తన తనయుడు ముత్తుముల దివ్యేష్ రెడ్డిని కసినేపల్లి గ్రామానికి పంపించారు. దీనితో ఎమ్మెల్యే తనయుడు దివ్యేష్ రెడ్డి బుధవారం కసినేపల్లి గ్రామానికి చేరుకొని నూతన ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆలయ అర్చకులు దివ్యేష్ రెడ్డి కి పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం బండలాగుడు పందెం పోటీల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని బండలాగుడు పందెం పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఆ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు, కసినేపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రామ దేవతల ఆశీస్సులే గ్రామాలకు శ్రీరామరక్ష





**కొమరోలు పెన్ పవర్ మే 6**

గ్రామదేవతల ఆశీస్సులు, దీవెనలే గ్రామాలకు శ్రీరామరక్ష అని కొమరోలు జడ్పిటిసి సభ్యులు సారే వెంకట నాయుడు పేర్కొన్నారు. కొమరోలు మండలం చింతలపల్లి పంచాయతీలోని కసినేపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ దేవతల ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఈనెల 4వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా ఆరవ తేదీ బుధవారం ఆ గ్రామంలోని నూతన ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలకు వెంకట నాయుడు హాజరై పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు వెంకట నాయుడు కు ఘన స్వాగతం పలికారు. ఆ సందర్భంగా వెంకట నాయుడు మాట్లాడుతూ గ్రామదేవతల ను ఆరాధించటం ,పూజా కార్యక్రమాలు ,వేడుకలు, వార్షికోత్సవాలు నూతన ఆలయాల నిర్మాణాలు ధ్వజా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించడం అనాదిగా వస్తున్న సాంప్రదాయమని, అదే సాంప్రదాయాన్ని నేటికి కూడా కొనసాగిస్తూ నిర్వహించడం అభినందనీయమని అన్నారు.సాయంత్రం రాష్ట్రస్థాయి బండలాగుడు పందెం పోటీలు నిర్వహించారు. సదరు పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జడ్పిటిసి వెంకటనాయుడు బండలాగుడు పందెం పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఆ కార్యక్రమంలో చింతలపల్లి మాజీ సర్పంచ్ సారే జనార్ధన్ నాయుడు, పుల్లారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ వైజా నారాయణరెడ్డి,పలువురు వైసిపి నేతలు కార్యకర్తలు కసినేపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# 13న గిద్దలూరు ఎ.ఎం.సి ప్రాంగణంలో పశువుల సంత ప్రారంభం

**గిద్దలూరు, పెన్ పవర్, మే 6**



రైతులు, పశు పోషకుల శ్రేయస్సును, సంక్షేమం దృష్టిలో పెట్టుకుని గిద్దలూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో ఈ నెల 13వ తేదీ బుధవారం గొర్రెల సంతను ప్రారంభిస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బైలడుగు బాలయ్య, కార్యదర్శి కె.రామకృష్ణ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. గిద్దలూరు ఎమ్యెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి చేతుల మీదుగా సంత ప్రారంభించబడును. ప్రతీ శుక్రవారంనాడు జరిగే పశువుల సంత ద్వారా పశుపోషకులు, వ్యాపారులు క్రయ విక్రయాలు చేసుకోవచ్చున్నారు.

# ప్రతి బుధవారం స్వచ్ఛ పథం కార్యక్రమం నిర్వహించాలి

## కనిగిరి డివిజనల్ డెవలప్మెంట్ అధికారి కె శ్రీనివాసరెడ్డి





**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 6**

పంచాయతీల స్థాయిలో రహదారులను చెత్తాచెదారం లేకుండా తీర్చిదిద్దడమే లక్ష్యంగా బుధవారం రోజున స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని నిర్వహించాలని మండల స్పెషల్ ఆఫీసర్ కనిగిరి డివిజనల్ డెవలప్మెంట్ అధికారి కె శ్రీనివాసరెడ్డి అన్నారు మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర" లక్ష్య సాధనలో భాగంగా చేపడుతున్న స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని మండల స్పెషల్ ఆఫీసర్, కనిగిరి డివిజనల్ డెవలప్మెంట్ అధికారి కె. శ్రీనివాసరెడ్డి బుధవారం ప్రత్యక్షంగా సందర్శించి పరిశీలించారు. గ్రామంలోని వివిధ ప్రాంతాలను పరిశీలించిన ఆయన, పరిశుభ్రత పనుల పురోగతిని సమీక్షించి అధికారులకు అవసరమైన సూచనలు అందించారు.పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారులు, అంతర్గత వీధులు, కాలనీలు, పబ్లిక్ ప్రదేశాలలో పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించడం, రోడ్డు ప్రక్కన పెరిగిన పొదలు, పిచ్చి మొక్కలను నిర్మూలించడం వంటి పనులను ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రమైన మరియు ఆకర్షణీయమైన వాతావరణంగా మార్చే దిశగా సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని, రహదారుల వెంట చెత్త లేకుండా, శుభ్రంగా ఉంచడం ద్వారా గ్రామ ప్రజలకు ఆరోగ్యకర వాతావరణం కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి పంచాయతీలో ప్రతి బుధవారం స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని నిరంతరంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. రహదారుల పక్కన చెత్త పేరుకుపోవడం వల్ల వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని, అందుకే శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా నిర్వహించడం మురుగునీరు నిలవ లేకుండా చూడడం గ్రామ పరిధిలోని ప్రతి వీధిలో పరిశుభ్రంగా ఉంచడం అత్యంత అవసరమని తెలిపారు గ్రామాల్లో చెత్త నిర్వహణను సక్రమంగా అమలు చేయాలని , సేకరించిన చెత్తను తడి చెత్త పొడి చెత్తగా వేరు చేసి నాలుగు రకాల డస్ట్ బిన్స్ లలో సేకరించాలని, తద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు రీసైక్లింగ్ ప్రక్రియకు దోహదపడుతుందని అన్నారు ప్రతి ఇంటి వద్ద నుండి చెత్త సేకరణ సక్రమంగా జరుగుతున్నదా లేదా పర్యవేక్షించాలని సూచించారు హరిత రాయబారులు గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి చెత్త వేరు చేయు విధానం పరిశుభ్రత ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని అలాగే ఐవీఆర్ కాల్స్ ద్వారా ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ సేకరించాలని చెత్త సేకరణ జరుగుతున్నదని నిర్ధారించేందుకు ప్రజలు ఒకటి నొక్కే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు స్వచ్ఛ పథం విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం కీలకమని ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచడం ద్వారా గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దవచ్చని అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి ప్రతాపరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో బ్రహ్మానంద రెడ్డి, మండలంలోని పంచాయతీ అభివృద్ధి అధికారులు, హరిత రాయబారులు, పారిశుద్ధ్య కార్మికులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# జగనన్న కాలనిలో హోంగార్డు ఇంట్లో చోరీ



**గిద్దలూరు పెన్ పవర్ మే 6**

గిద్దలూరు పట్టణంలో చోరీ ఘటన కలకలం రేపింది. గిద్దలూరు మోడంపల్లె జగనన్న కాలనీలో తాళం వేసి ఉన్న గృహంలో ఈ దొంగతనం జరిగింది. వివరాల ప్రకారం, హోంగార్డు ఆవుల కాశయ్య కుటుంబ సభ్యులు వివాహ నిమిత్తం కలసపాడు వెళ్లి బుధవారం ఉదయం సుమారు 9 గంటల కు ఇంటికి చేరుకున్నారు. ఇంటి వద్దకు వచ్చేసరికి తలుపు , తాళాలు, పగలగొట్టబడి ఉండటంతో వారు ఆందోళనకు గురయ్యారు. లోపలికి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టి అందులోని దుస్తులు మొత్తం చెల్లాచెదురుగా వేసిఉండటాన్ని గమనించారు . వెంటనే గిద్దలూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ దొంగతనంలో బీరువాలో ఉన్న సుమారు ఒక తులం బంగారం , వెండి వస్తువులను దుండగులు దోచుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు, గిద్దలూరు అర్బన్ సీఐ సురేష్ ఆధ్వర్యంలో సంఘటనా స్థలానికి చేరుకుని ,చోరీ జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేష్ తెలిపారు .క్లూస్ టీమ్ గిద్దలూరు చేరుకుని ఆధారాలు సేకరించింది.

# సబ్సిడీ పై యంత్ర పరికరాలు

**పొన్నలూరు పెన్ పొన్నలూరు మే 6**



వ్యవసాయశాఖ లో ఎస్ ఎం ఏ ఎం స్కీమ్ క్రింద 2025-26 సంవత్సరానికి వ్యక్తిగత వ్యవసాయ యంత్ర పరికరాలకు సంబంధించి వ్యక్తి గత నాగల్లు, స్ప్రేయర్లు, విత్తన గొర్రు, నూర్పిడు యంత్రాలు మొదలగు పరికరాలు గాను మొత్తం రూ 15.34 లక్షలు మంజూరు అయ్యాయని,సన్న, చిన్న కారు మహిళా రైతులకు 50% శాతం రాయితీ 5 ఎకరాలు పై బడి వున్న పెద్ద రైతులకు 40%శాతం రాయితీ ఉందని మండల వ్యవసాయ అధికారి వి రాము తెలియజేసారు.అర్హులైన రైతులు మే నెల 19 వ తేదీ లోపల మీ సంబంధిత రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ్యాధికారి తెలియజేసారు, కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# గుంతకల్లు, గిద్దలూరు, మార్కాపురం రోడ్డు మధ్య కొత్త రైలు



**గిద్దలూరు పెన్ పవర్ మే 6**

ఈనెల 13వ తేదీ నుంచి దక్షిణ మధ్య రైల్వే అధికారులు గుంతకల్లు, మార్కాపురం రోడ్డు రైల్వే స్టేషన్ మార్గాల మధ్య ప్రతిరోజు ప్యాసింజర్ రైలు నడిపేందుకు సిద్ధమయింది. 57407/ 57408 నంబర్ తో నడిచే ఈ రైలు గుంతకల్లు, మద్దికేర, పెండేకల్లు, డోన్, రంగాపురం, బేతంచెర్ల, పాణ్యం, నంద్యాల, గాజులపల్లి, దిగువమెట్ట, గిద్దలూరు, సోమిదేవిపల్లి, జగ్గంబట్ల కృష్ణాపురం, కంభం, తర్లుపాడు రైల్వే స్టేషన్లలో ఆగుతూ మార్కాపురం రైల్వే స్టేషన్ కి చేరుకుంటుంది. ప్రతిరోజు గుంతకల్లులో సాయంత్రం 5:30 కి బయలుదేరి రాత్రి 11:30 కి మార్కాపురం చేరుకుంటుంది. మార్కాపురం రోడ్డులో ప్రతిరోజు తెల్లవారుజామున 4:30 నిమిషాలకు బయలుదేరి ఉదయం 10: 30 నిమిషాలకు గుంతకల్లు చేరుతుంది.

# పక్కా గృహాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేందుకు చర్యలు తీసుకోవాలి

**కొమరోలు లోని హౌసింగ్ కార్యాలయాన్ని గోడౌన్ పరిశీలించిన మార్కాపురం జిల్లా పిడి ఎంవి మోహన్ రావు.**





**కొమరోలు పెన్ పవర్ మే 6**

లబ్ధిదారులు పక్కా గృహాల నిర్మాణాలను త్వరతగతిన పూర్తి చేసుకునే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని మార్కాపురం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కోరారు. బుధవారం మోహన్ రావు కొమరోలు వచ్చిన సందర్భంగా హౌసింగ్ కార్యాలయాన్ని, గోడౌన్ సందర్శించి కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసి హౌసింగ్ ఏఈ జీ కృష్ణారెడ్డికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం హౌసింగ్ గోడౌన్ ను సందర్శించి గోడౌన్లో నిల్వ ఉన్న సిమెంటు, స్టీలు ను పరిశీలించారు. అనంతరం పిడి మోహన్రావు మాట్లాడుతూ కే పి ఐ టార్గెట్ హౌసెస్ ను త్వరితగతిన పూర్తి చేసుకునేందుకు లబ్ధిదారులకు ప్రభుత్వ పరంగా పూర్తి సహకారం అందిస్తామని ఆయన తెలిపారు. అందుకు అవసరమైన మెటీరియల్ను బిల్లులను మంజూరు చేస్తామన్నారు. లబ్ధిదారులు కూడా తమకు మంజూరైన పక్కా గృహాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకొని సొంతింటి కలను సాకారం చేసుకోవడమే కాకుండా, ప్రభుత్వ ఆశయాలని నెరవేర్చాలని కోరారు. పక్క గృహాల నిర్మాణాల పట్ల ఏవైనా సమస్యలు ఉంటే హౌసింగ్ ఏఈ కృష్ణారెడ్డికి వివరించి వాటి పరిష్కారానికి సహకరించాలని కోరారు ఆ కార్యక్రమంలో డి ఈ కోటిరెడ్డి, కొమరోలు హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ శివ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

## అర్ధవీడు ఎస్సై శివ నాంచారయ్య

**అర్ధవీడు, పెన్ పవర్, మే 6**

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అర్ధవీడు ఎస్సై శివ నాంచారయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రమైన అర్ధవీడు మండల మహిళా సమాఖ్య కార్యాలయం నందు విఓఎలకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళలు తమ హక్కులు, చట్టాల గురించి తప్పనిసరిగా తెలుసుకోవాలని ఆయన అన్నారు. చట్టాలపై అవగాహన ఉంటే అన్యాయాలను ధైర్యంగా ఎదుర్కోగలరని తెలిపారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం అనేక చట్టాలను అమలు చేస్తోందన్నారు. వాటిని ప్రతి మహిళ తెలుసుకోవడం ఎంతో అవసరమని సూచించారు. ఇంటి వద్దగానీ, కార్యాలయాల్లోగానీ వేధింపులు ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని చెప్పారు. ఫిర్యాదు చేయడానికి భయపడవద్దని మహిళలకు ధైర్యం చెప్పారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేక హెల్ప్లైన్ నంబర్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అవసరమైన సమయంలో వాటిని వినియోగించుకోవాలని సూచించారు. బాల్యవివాహాలు, వేధింపులు, గృహహింస వంటి సమస్యలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. పిల్లలపై జరిగే దుర్వినియోగాలను కూడా వెంటనే తెలియజేయాలని కోరారు. మహిళలపై జరిగే నేరాలను అరికట్టడంలో సమాజం భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రతి మహిళ తన హక్కులను తెలుసుకొని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళల విద్యాభివృద్ధి కూడా సమాజ పురోగతికి కీలకమని అన్నారు. చట్టాలపై అవగాహన పెరిగితే మహిళలు మరింత



ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగగలరని తెలిపారు. ప్రస్తుత కాలంలో సైబర్ నేరాల పట్ల కూడా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, సందేశాలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎటువంటి అనుమానాస్పద ఘటన జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మహిళలు స్వీయరక్షణ పట్ల కూడా శ్రద్ధ చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం రమేష్, సీసీలు గురువయ్య, శారద అకౌంటెంట్ శ్రీదేవి, విఓఎలు తదితరులు పాల్గొన్నారు.

# మురుగు కదలదు.. దోమలు వదలవు



**వలేటివారిపాలెం, పెన్ పవర్ మే 06**

అంక భూపాల పురం గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. ఎస్సీ కాలనీలో కాలువల్లో మురుగు నీరు ముందుకు కదలడం లేదు. దీంతో దోమలకు ఆవాసంగా మారి ప్రజలపై తమ ప్రతాపం చూపుతున్నాయి. రోడ్డు పక్కనే మురుగు నిలిచి దుర్గంధం వెదజల్లుతుంది. అటుగా రోడ్డుపై నడిచి వెళ్ళే ప్రజలు ముక్కు మూసుకోవాల్సి వస్తుంది. మురుగు కాల్వలో దోమలు చేరి రాత్రులు తమ ప్రతాపం కాలనీలోని ప్రజలపై చూపుతున్నాయని కాలనీ ప్రజలు చెబుతున్నారు. దోమల బెడద దెబ్బకు వ్యాధులు ప్రభలే అవకాశాలు ఉన్నాయని పంచాయతీ అధికారులు స్పందించి మురుగు తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని ప్రజలు కోరుతున్నారు.

# నేడు మోట్రావులపాడులో రెవిన్యూ సదస్సు

## తహసిల్దార్ వాసుదేవరావు



**పామూరు, పెన్ పవర్, మే 6**

వన్ మంత్, వన్ విలేజ్ ఫోర్ విజిట్, కార్యక్రమానికి శ్రీకారం. జిల్లా కలెక్టర్ మరియు జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు పామూరు మండల వ్యాప్తంగా ఒక నెలలో ఒక విలేజ్ లో నాలుగు రెవెన్యూ సదస్సులు నిర్వహించి గ్రామంలో ఉన్న ప్రతి రెవెన్యూ సమస్యకు పరిష్కరించే దిశగా నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని తహసిల్దార్ వాసుదేవరావు తెలిపారు. అందులో భాగంగా మండలంలోని మోట్రావులపాడు గ్రామాన్ని ఈనెల ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు, అదేవిధంగా మండలంలో ఉన్న ప్రతి గ్రామానికి ఈ కార్యక్రమంలో భాగంగా, ఒక నెలలో, ఒక విలేజ్, నాలుగు విజిట్ల ద్వారా సదస్సులు నిర్వహించి, భూ సంబంధిత సమస్యలు, మ్యూటేషన్లు, రీసర్వే అంశాలు, సరిహద్దు వివాదాలు, దారి వివాదాలు, వెబ్ల్యాండ్ మరియు ఇతర రెవెన్యూ సమస్యలపై గ్రామ ప్రజల నుండి వినతులు స్వీకరించబడనున్నాయని సమస్యలను పరిష్కరించే దిశగా, ప్రజలకు అవగాహన చేపట్టడం ద్వారా గ్రామస్థాయిలోనే వారి వారి సమస్యలకు పరిష్కారం అందించే విధంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపట్టడం జరిగిందని తహసిల్దార్ వాసుదేవరావు తెలిపారు.

# ఇంగ్లీష్ పై పట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది -ఏ. డి. ఏ రాజశ్రీ

**గిద్దలూరు పెన్ పవర్ మే 6**

ఇంగ్లీష్ పై పట్టు సాధించడం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని గిద్దలూరు ఏ. డి. ఏ రాజశ్రీ అన్నారు. గిద్దలూరు లోని గ్రీన్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ నిర్వాహకులు బిజ్జం సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో బిజ్జం చంద్రశేఖర్ రెడ్డి పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఉచిత గ్రామర్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో స్పొకెన్ ఇంగ్లీషు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ ను పెంపొందించుకోవాలి సూచించారు. అనంతరం విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్ పుస్తకాలను, ప్రశంసా పత్రాలను ఏ. డి. ఏ రాజశ్రీ,, గిద్దలూరు సిటీ కేబుల్ నిర్వాహకులు కత్తెరపల్లె ఓబుల్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి. విక్టర్ పాల్, సి. పి నవోదయ కోచింగ్ నిర్వాహకులు చీతిరాల ప్రసాద్,సొసైటీ నిర్వాహకులు పాల్గొన్నారు.



# ఎసి ఎల్ పి జీవనోపాదుల సర్వేను కచ్చితత్వంతో చేయాలి - ఎపిఎం రమేష్



**అర్ధవీడు, పెన్ పవర్, మే 6**

ఏ సి ఎల్ పి జీవనోపాదుల సర్వేను అందరు విఓఎలు కచ్చితత్వంతో చేయాలని ఏపీఎం రమేష్ అన్నారు. బుధవారం అర్ధవీడు మండల మహిళా సమైక్య కార్యాలయం నందు మండలంలోని అందరికీ నెలలో మొదటి బుధవారం రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ రివ్యూ లో విఓఎలు చేయవలసిన గ్యాప్ వర్క్ ల గురించి, బుక్ కీపింగ్ 15 తేదీ నాటికి అన్ని గ్రామ సంఘాలు కంప్లీట్ చేయాలి, స్త్రీనిధి,ఉన్నతి, సి ఐఎఫ్, బ్యాంకు లింకేజీ రికవరీల గురించి, మరియు ఎసి ఎల్ పి జీవనోపాదుల



సర్వే కు సంబంధించి వివరించారు . 2025 26 ఆర్థిక సంవత్సరం సంబంధించి అందరూ విఓఎలు బుక్స్ రెడీ చేసుకుని సిసిల ద్వారా సిబిఓ అకౌంటింగ్ చేయించుకొని ఆడిట్ కు రెడీగా ఉంచుకోవాలని తెలియజేసి ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎంతో పాటు సీసీలు గురువయ్య, శారద, అకౌంటెంట్ శ్రీదేవి, వివో ఏలు తదితరులు పాల్గొన్నారు.

# కొండముచ్చు పరార్

### మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం -వేలుకు వేలు ఖర్చుపెట్టి తీసుకువచ్చిన అధికారులు కొండముచ్చును కాపాడుకోవడంలో విఫలం

**మార్కాపురం టౌన్ పెన్ పవర్ మే6**

మున్సిపాలిటీలో కోతుల బెడద అధికంగా ఉండడంతో మున్సిపాలిటీ అధికారులు బెడదను నివారించేందుకు పదివేల రూపాయలను ఖర్చుపెట్టి ఒక కొండముచ్చును కొనుగోలు చేశారు. ఈ కొండముచ్చును పట్టణంలో అధికంగా కోతులు సంచరించే ప్రాంతంలో తిప్పడం ద్వారా కోతులు పారిపోతాయి అనేది మున్సిపల్ అధికారుల ఆలోచన. అయితే ఈ ఆలోచనకు రూపం దాలుస్తూ నంద్యాల జిల్లా ఆత్మకూరు ప్రాంతం నుండి జత కొండముచ్చులను సుమారు10 వేల రూపాయలకు కొనుగోలు చేశారు. ఈ కొండముచ్చును పట్టణంలోని పురవీధులలో తిప్పేందుకు ఓ వ్యక్తిని నియమించి అతనికి నెల జీతం ఇస్తూ కొండముచ్చు బాగోగులను అప్పగించారు. సదరు వ్యక్తి ప్రతిరోజు ఉదయాన్నే కొండముచ్చును తీసుకొని పట్టణంలోని కోతుల బెడద ఉన్న ప్రాంతాలలో తిరుగుతూ సాయంత్రానికి ఆ కొండముచ్చును మున్సిపాలిటీలో ప్రత్యేకంగా కేటాయించిన బోనులో బంధించేవారు. కొండముచ్చును తిప్పే వ్యక్తి మద్యపాన వ్యసనపరుడు కావడంతో దాని బాగోగులు గాలికి వదిలేసాడు. దీనితో మున్సిపాలిటీ



కార్యాలయం ప్రాంతంలో గల మార్కెట్లో పళ్ళు విక్రయించేవారు కొన్ని పండ్లను కొండముచ్చుకు ఆహారంగా వేసేవారు. నిత్యం తినే అరటిపండు, యాపిల్, బొప్పాయ, జామ, ఇతరత్రాలు తిని తిని ఎగటు పుట్టి అవి కూడా



తినడం మానివేసిన కొండముచ్చు ఆహారపానియాలను వదిలి బక్క చిక్కిపోయింది. అసలే వేసవికాలం కావడంతో తల్లడిల్లిపోయిన కొండముచ్చు గత నాలుగు రోజుల కిందట బోను నుండి తప్పించుకొని మున్సిపాలిటీ సిబ్బంది కళ్లు గప్పి పారిపోయింది. దానిని పట్టుకునేందుకు సిబ్బందిలో కొందరు ప్రయత్నించిన ఫలితం లేకుండా పోయింది. గతంలో కూడా ఇదే తరహాలో మున్సిపాలిటీ వారు నంద్యాలలో పదిహేను వేల రూపాయలకు కొనుగోలు చేసిన కొండముచ్చు పారిపోయి వార్తలలోకి ఎక్కింది. రెండవసారి కొనుగోలు చేసిన జత కొండముచ్చులలో ఒకటి కొనుగోలు చేసి తెచ్చిన కొత్తలోనే అనారోగ్యంతో చనిపోగా మరొకటి పారిపోయింది.. ఏది ఏమైనా కోతుల అంతు చూసేందుకు కొండముచ్చును కొనుగోలు చేసిన మున్సిపల్ అధికారులు దాని బాగోగులు చూసే విషయంలో పూర్తిగా విఫలం కావడంతో అర్ధాకలితో అలమటిస్తూ ఆ కొండముచ్చు పారిపోయింది.

## మంత్రి అచ్చంనాయుడును కలిసిన కోనంగి వెంకట కొండయ్య



**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 6**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి కింజారపు అచ్చంనాయుడును బుధవారం ఉమ్మడి ప్రకాశం జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్ త్రిసభ్య కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూనియన్ చైర్మన్ కడియం మణికంఠతో పాటు డైరెక్టర్లు కోనంగి వెంకటకొండయ్య, ఏనుగంటి పద్మావతిలు కలిసి మంత్రికి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా కోనంగి వెంకటకొండయ్య మాట్లాడుతూ గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్ త్రిసభ్య నూతన కమిటీ ఏర్పాటైన నేపథ్యంలో జిల్లాలోని గొర్రెల పెంపకదారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అదేవిధంగా ప్రభుత్వ పథకాల అమలు, సంక్షేమ పథకాలు , గొర్రెల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరినట్లు తెలిపారు మంత్రి అచ్చంనాయుడు సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ గొర్రెల పెంపకం రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కీలకమని, ఈ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి పేర్కొన్నట్లు తెలిపారు.

## టిడిపి కార్యాలయం భూమిపూజలో పాల్గొన్న ఇంటూరి





**కందుకూరు పెన్ పవర్, మే 6**

తెలుగుదేశం పార్టీ, ఒంగోలు పార్లమెంట్ కార్యాలయానికి నూతనభవనాన్ని ఒంగోలు ఓల్డ్ బైపాస్ పక్కన భాగ్యనగర్ లో నిర్మించబోతున్నారు. దానికి సంబంధించిన భూమిపూజ కార్యక్రమం బుధవారం ఉదయం జరిగింది. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి , ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి , రాష్ట్ర మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య , రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ ఇతర ముఖ్యనేతలతో కలిసి కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు హాజరయ్యారు.

## పామూరు 4వ స్వర్ణ గ్రామాన్ని తనిఖీ చేసిన డిప్యూటీ ఎంపీడీవో హజ్రత్ అలీ



**పామూరు, పెన్ పవర్, మే6**

ప్రజల సౌకర్యార్థం పామూరు గ్రామ పంచాయతీ భవనంలో ఉన్న 4వ స్వర్ణ గ్రామా కార్యాలయాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వెనుక ఉన్న ఆర్‌బీకే భవనంలోకి మార్చారు. బుధవారం డిప్యూటీ ఎంపీడీఓ హజరత్ అలీ పట్టణంలోని 4వ స్వర్ణ గ్రామా కార్యాలయాన్ని డిప్యూటీ ఎంపీడీవో హజ్రత్ అలీ సందర్శించి ఈ మార్పు ప్రక్రియను పర్యవేక్షించారు. పంచాయతీ భవనంలో స్థలం సరిపోకపోవడం, ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతుండటంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారని ఆయన తెలిపార అన్నారు. ఆర్‌బీకే భవనంలో విశాలమైన స్థలం ఉండటంతో స్వర్ణ గ్రామం ద్వారా అందించే సేవలు ప్రజలకు మరింత చేరువవుతాయని డిప్యూటీ ఎంపీడీఓ తెలిపారు. స్వర్ణ గ్రామం ద్వారా పింఛన్లు, రేషన్, ఆరోగ్య సేవలు, ఇతర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సేవలు ఒకేచోట లభిస్తాయి. స్థానం మారిన విషయాన్ని ప్రజలందరూ గమనించి నూతన భవనంలో సేవలు వినియోగించుకోవాలని అధికారులు కోరారు.

# గ్రామాల అభివృద్ధి, పరిశుభ్రత ప్రభుత్వ లక్ష్యం -గూడూరి ఎరిక్షన్ బాబు





**పుల్లల చెరువు పెన్ పవర్ మే 6**

మండలంలోని మర్రివేముల గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కొలుపుల్లో యర్రగొండపాలెం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి అమ్మవారికి మొక్కులు చెల్లించి, ప్రాంత అభివృద్ధి కోసం ఆశీర్వాదాలు కోరారు. అనంతరం జల సురక్ష మిషన్ కార్యక్రమంలో భాగంగా మర్రివేముల మరియు ఎర్రబాలెం గ్రామాలలో వేసవి కాలంలో తాగునీటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని రూ.10 లక్షల వ్యయంతో తవ్వించిన మూడు డీప్ బోర్లను ఆయన ప్రారంభించారు. ఈ బోర్ల ద్వారా గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య కొంతవరకు పరిష్కారం అవుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఇదే సందర్భంలో స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని కూడా నిర్వహించి, గ్రామాల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పారిశుధ్య కార్మికులకు అవసరమైన సూచనలు ఇస్తూ, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎరిక్షన్ బాబు పిలుపునిచ్చారు. గ్రామ అభివృద్ధికి పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలు అత్యంత కీలకమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పోట్ల గోవిందు, మాజీ మండల కన్వీనర్ పయ్యావుల ప్రసాద్, శనగ నారాయణ రెడ్డి, రెంటపల్లి సుబ్బారెడ్డి, కాకర్ల కోటయ్య, ఎంపీడీవో మరియదాసు, మేడికొండ లక్ష్మణ్, పల్లాపాటి బదరయ్య, పావులూరి యోగయ్య, పాతకోటి రామిరెడ్డి, శనగ వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ వెంగయ్య, కేసనపల్లి బక్కయ్య, తక్కల్లపాటి వెంకటేశ్వర్లు, కర్రావుల వెంకయ్య, జనసేన అధ్యక్షుడు కటారి ఆచయ్య, గ్రామ నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెవెన్యూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోండి..

### తహసీల్దార్ నలగాటి మల్లిఖార్జున నాయుడు



**పుల్లల చెరువు పెన్ పవర్ మే 6**

మండల ప్రజలు రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని పుల్లలచెరువు తహసీల్దార్ నలగాటి మల్లిఖార్జున నాయుడు సూచించారు. ప్రజలకు నేరుగా ప్రభుత్వ సేవలు అందించడంతో పాటు, భూ సంబంధిత సమస్యలు, రికార్డుల సవరణలు, వారసత్వ నమోదు, పాస్‌బుక్ సమస్యలు, సరిహద్దు వివాదాలు, సర్వే అంశాలు వంటి సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఒక నెలలో ఒక గ్రామం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రతి గ్రామంలో నెలరోజుల పాటు నాలుగు దఫాలుగా గ్రామసభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రతి వారం ఒకసారి గ్రామసభ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని నమోదు చేసి, సంబంధిత శాఖల సమన్వయంతో నాలుగు వారాల్లో పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులందరూ హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని చెప్పారు. మండలంలో తొలి గ్రామసభ ఈ నెల 7వ తేదీన చౌటపాచర్ల గ్రామంలో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. గ్రామ ప్రజలు తమకు ఉన్న రెవెన్యూ సంబంధిత సమస్యలు, భూ రికార్డుల సమస్యలు, సర్వే అంశాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణల ఫిర్యాదులు, ఇతర శాఖలకు సంబంధించిన వినతులను అర్జీల రూపంలో సమర్పించాలని కోరారు. గ్రామసభలో తహసీల్దార్‌తో పాటు ఎంపీడీవో, డీటీ, ఆర్ఐ, విఆర్వో, గ్రామ సర్వేయర్, మండల సర్వేయర్, పీఆర్ ఏఈ, ఇరిగేషన్ ఏఈ, ఫారెస్ట్ రేంజ్ అధికారి, ఎండోమెంట్స్ అధికారి తదితర శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. అన్ని శాఖల అధికారులు ఒకే వేదికపై అందుబాటులో ఉండటంతో ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గ్రామస్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలను అధికారులకు తెలియజేసి పరిష్కారం పొందాలని తహసీల్దార్ మల్లిఖార్జున నాయుడు విజ్ఞప్తి చేశారు. మండలంలో ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే ఈ గ్రామసభల ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు.

# భూమి పూజ కార్యక్రమములో భారీగా తరలి వెళ్లిన టిడిపి నాయకులు

**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 6**

కనిగిరి శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ ఆధ్వర్యంలో మండలం నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు బుధవారం ఒంగోలు పార్లమెంట్ టిడిపి కార్యాలయం భూమి పూజ కార్యక్రమానికి భారీగా తరలి వెళ్లారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా, పార్టీ జెండాలు, నినాదాల మధ్య జరిగింది. ఈ సందర్భంగా బొబ్బూరి రమేష్ మాట్లాడుతూ ఒంగోలు పార్లమెంట్ పరిధిలో పార్టీ బలోపేతానికి కొత్త కార్యాలయం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యాలయం పార్టీ కార్యకలాపాలకు కేంద్రబిందువుగా మారి నాయకులు, కార్యకర్తలకు సమన్వయ వేదికగా ఉపయోగపడుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు బత్తుల వెంకటాద్రి, సంగిశెట్టి పీరయ్య నాయుడు, టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# మజ్జిగ పంపిణీ





**కందుకూరు పెన్ పవర్ మే 6**

పెన్ పవర్ బ్యూరో చీఫ్ నవులూరి సుధీర్ – ప్రమీల దంపతులు తన కుమార్తె చిరంజీవి నవులూరి లహరి నాలుగవ వర్ధంతి సందర్భంగా స్కందపురి సేవా సమితి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. దాతల సహకారంతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు పువ్వాడి మౌనిక తెలిపారు. దాతల సహకారానికి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో అత్తంటి శివకృష్ణ, గుమ్మ శివ, భవనాసి వెంకటేశ్వర్లు, మచ్చ మనోహర్, జక్కుల శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## డీఆర్ఓ గా బాధ్యతలు చేపట్టిన వెంకట శివరామిరెడ్డి

**మార్కాపురం పెన్ పవర్ మే6**



జిల్లా నూతన డిఆర్ ఓగా ఎం వెంకట శివ రామిరెడ్డి బుధవారం కలెక్టరేట్ లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రెవిన్యూ అధికారులు సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. ఇప్పటివరకు ఆయన ఎస్ డీ సి (కంభం), ఇన్చార్జి కనిగిరి ఆర్డీవో గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఏఓ రవీంద్రారెడ్డి, తహసిల్దార్ చిరంజీవి, ఇతర రెవెన్యూ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

## అజ్మీర్ దర్గాలో ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు



**మార్కాపురం పెన్ పవర్ మే6**

అజ్మీరులోని శ్రీ ఖాజా మొహినుద్దీన్ ఛిష్టి దర్గాలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, టిడిపి నాయకులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జిల్లా ప్రజలు, మార్కాపురం నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని చాదర్ సమర్పించి ప్రార్థనలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో త్వరలో వెలుగొండ ప్రాజెక్టు పూర్తి అవ్వాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అజ్మీర్ దర్గా లో ప్రార్థనలు నిర్వహించినట్లు తెలిపారు.

## దద్దాలకు వివాహ పత్రికను అందజేసిన గంటా రమణయ్య

**పామూరు , పెన్ పవర్, మే 6**



మండలంలోని చట్టిమడుగు చెందిన వైయస్సార్సీపి నాయకులు గంటా రమణయ్య కుమార్తె వివాహ వేడుకకు కనిగిరి నియోజకవర్గ వైయస్సార్సీపి ఇంచార్జ్ దద్దాల నారాయణ యాదవ్ ను బుధవారం ఆయన స్వగృహం నందు గంటా రమణయ్య , జొన్నలగడ్డ ప్రహ్లాద్ కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 9న చట్టిమడుగు లోని స్వగృహం నందు జరుగు వివాహానికి హాజరై నూతన వదలను ఆశీర్వదించాలని గంటా రమణయ్య కోరినట్లు తెలిపారు.

# సీఎం క్యాండిటేట్... సిట్టింగ్ ఎంపీ...ఓటమి

**గౌహాతి, మే 6, పెన్ పవర్:** కాంగ్రెస్ పార్టీ నుంచి ముఖ్యమంత్రిగా భావించిన గౌరవ్ గొగోయ్.. సిట్టింగ్ ఎంపీగా ఉండి కూడా అసెంబ్లీ పోరులో పరాజయం పాలవ్వడం ఇప్పుడు అస్సాంలో హాట్ టాపిక్‌గా మారింది. . కేవలం వారసత్వంతోనే గెలవలేమని, ప్రజల మధ్య ఉండకపోతే ఎంతటి దిగ్గజాలకైనా ఓటమి తప్పదని ఈ ఫలితం నిరూపించిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.అస్సాం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌పార్టీకి కోలుకోలేని షాక్ ఇచ్చాయి. ముఖ్యంగా ఆ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న, మూడుసార్లు ఎంపీగా గెలిచిన గౌరవ్ గొగోయ్ తన సొంత ఇలాకా జోర్హాట్‌లో ఓటమి పాలవ్వడం అందరినీ విస్మయానికి గురిచేసింది. మాజీ ముఖ్యమంత్రి తరుణ్ గొగోయ్ వారసుడిగా భారీ అంచనాలతో బరిలోకి దిగిన గౌరవ్.. బీజేపీ సీనియర్ నేత హితేంద్రనాథ్ గోస్వామి చేతిలో దాదాపు 22,000 ఓట్ల భారీతేడాతో పరాజయం పాలయ్యారు. తన లోక్‌సభ పరిధిలోని దాదాపు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ పట్టు కోల్పోవడం గమనార్హం.గౌరవ్ గొగోయ్ ఓటమికి ప్రధాన కారణం ప్రజలకు అందుబాటులోలేకపో వడమేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రచార సమయంలో ఆయన క్షేత్రస్థాయిలో తగినంతగా కనిపించలేదని.. కేవలం తన తండ్రి పేరు మీద, అహోం సామాజిక వర్గ సమీకరణాల మీద అతిగా ఆధార పడటం బెడిసి కొట్టిందని చెబుతున్నారు. అలాగే బీజేపీ వ్యూహాత్మకంగా గౌరవ్‌ను 'జాతీయ రాజకీయాలకు మాత్రమే సరిపోయే నేత'గా చిత్రీకరించడంలో సఫలమైందని పేర్కొంటున్నారు. స్థానిక సమస్యల కంటే ఢిల్లీ రాజకీయాలకే ఆయన ప్రాధాన్యత ఇస్తారన్న ప్రచారం ఓటర్లను తీవ్రంగా ప్రభావితం చేసిందని వివరిస్తున్నారు.ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఈ ఎన్నికల్లో.. 'అభివృద్ధి వర్సెస్అడ్డంకులు'గా మధ్య పోటీగా అభివర్ణించి ఓటర్ల మనసు గెలుచుకున్నారు. గత ఐదేళ్లలో జోర్హాట్‌లో జరిగిన మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రజల్లో నమ్మకాన్ని పెంచింది. ముఖ్యంగా నియోజకవర్గాల పునర్విభజన తర్వాత జోర్హాట్‌లో చేరిన హోలోంగపర్ పంచాయితీ ప్రాంతంలో జరిగిన అభివృద్ధి బీజేపీకి బాగా కలిసొచ్చింది. హితేంద్రనాథ్ గోస్వామి ఎక్కడా దూకుడుగా వ్యవహరించకుండా.. గౌరవ్‌ను గౌరవిస్తూనే.. తాను లోకల్ లీడర్‌గా ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పడం ఓటర్లను ఆకట్టుకుంది.కేంద్ర మంత్రి పవిత్ర మార్గరీటా జోర్హాట్‌లో మకాం వేసి క్షేత్రస్థాయిలో చేసిన కృషి గొగోయ్ ఓటమిలో కీలక పాత్ర పోషించింది. గౌరవ్ లాగే అహోం సామాజిక వర్గానికి చెందిన పవిత్ర.. నిరంతరం ప్రజల్లో ఉంటూ గొగోయ్ ఓటు బ్యాంకును చీల్చగలిగారు. దీనికి తోడు హిమంత బిశ్వ శర్మ నిర్వహించిన భారీ ర్యాలీలు, ఇంటింటి ప్రచారం కాంగ్రెస్ ఓటమికి కారణం అయ్యాయి. యువ ఓటర్లలో అత్యధిక భాగం పోలింగ్ రోజున అందుబాటులో లేకపోవడం కూడా గౌరవ్ మెజారిటీని తగ్గించింది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## విశాఖలో ఎమ్మెల్యే వర్సెస్ కార్పొరేటర్..!

**విశాఖపట్టణం, మే 6, పెన్ పవర్:** విశాఖపట్నంలోని డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి సెంట్రల్ పార్క్ (పాత సెంట్రల్ జైలు రోడ్డు) వద్ద సుమారు ఆరు కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయ తలపెట్టిన ఫుడ్ కోర్టు నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ ప్రాజెక్టుపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం, ప్రస్తుతానికి పనులన్నింటినీ నిలిపివేస్తూ స్టేటస్ కో విధిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. కొద్దిరోజుల క్రితమే ఈ ఫుడ్ కోర్టు నిర్మాణానికి విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ అట్టహాసంగా శంకుస్థాపన చేశారు.అయితే, గ్రీనరీ మరియు బహిరంగ ప్రదేశాల కోసం ఉద్దేశించిన సెంట్రల్ పార్క్ స్థలంలో వాణిజ్య పరమైన ఫుడ్ కోర్టును నిర్మించడం నిబంధనలకు విరుద్ధమని జనసేన సీనియర్ నేత, కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ హైకోర్టును ఆశ్రయించారు. పర్యావరణ నిబంధనలను పక్కనబెట్టి, పార్కును వాణిజ్య కేంద్రంగా మార్చడం వల్ల నగరంలోని ఊపిరితిత్తుల్లాంటి పార్కులు దెబ్బతింటాయని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసును విచారించిన జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం స్టేటస్ కో విధిస్తూ ఆదేశాలిచ్చింది.వేసవి సెలవుల అనంతరం కోర్టు తిరిగి తెరిచి, విచారణ జరిగే వరకు ఎటువంటి నిర్మాణ పనులు చేపట్టవద్దని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో తమ వివరణ ఇవ్వాలని జీవీఎంసీ , వీఎంఆర్డీఏ , జిల్లా కలెక్టర్ మరియు రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖలకు నోటీసులు జారీ చేసింది. ఈ పరిణామం ఇప్పుడు విశాఖ జనసేనలో అంతర్గత విభేదాలను రోడ్డుపైకి తెచ్చింది. ఒకవైపు జనసేనఎమ్మెల్యే వంశీకృష్ణ ఈ ప్రాజెక్టును తన ప్రతిష్టాత్మక విజయంగా చెప్పుకుంటుండగా, అదే పార్టీకి చెందిన కార్పొరేటర్ మూర్తి యాదవ్ కోర్టుకు వెళ్లి దాన్ని అడ్డుకోవడం రాజకీయంగా కలకలం రేపుతోంది.నిబంధనలకు విరుద్ధంగా ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నారని మూర్తి యాదవ్ వర్గం ఆరోపిస్తుంటే.. అభివృద్ధిని అడ్డుకుంటున్నారని వంశీకృష్ణ మద్దతుదారులు విమర్శిస్తున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో ఉన్న నైట్ ఫుడ్ కోర్టును తొలగించి, పాత వెండర్లను కాదని కొత్త వారికి షాపులు కేటాయిస్తున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో ఈ స్టే రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఎమ్మెల్సీ అనంతబాబుకు బిగిస్తున్న ఉచ్చు

**కాకినాడ, మే 6 పెన్ పవర్:** సంచలనం సృష్టించిన డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు చుట్టూ ఉచ్చు మరింత బిగుస్తోంది. ఈ కేసులో సాక్షులను బెదిరించారన్న అభియోగాలపై అనంతబాబును ఒకరోజు పోలీసు కస్టడీకి అనుమతిస్తూ కాకినాడలోని మొబైల్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న అనంతబాబును పోలీసులు బుధవారం ఉదయం కస్టడీలోకి తీసుకున్నారు. భారీ భద్రత నడుమ ఆయనను రోడ్డు మార్గంలో రాజమహేంద్రవరం నుంచి కాకినాడకు తరలించారు. ఈ రోజు మొత్తం పోలీసుల విచారణ కొనసాగనుంది.డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో కీలక సాక్షులను ప్రలోభపెట్టడం, వారిని బెదిరించడం ద్వారా కేసును పక్కదారి పట్టించేందుకు అనంతబాబు ప్రయత్నించారనేది ప్రధాన ఆరోపణ. ఈ నేపథ్యంలో కాకినాడలోని సర్పవరం పోలీస్ స్టేషన్‌లో పోలీసు అధికారులు ఆయనను విచారించనున్నారు. సాక్షులను ఎవరెవరి ద్వారా బెదిరించారు? దీని వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో పోలీసులు ప్రశ్నించనున్నారు. గతంలో విచారణ సమయంలో అనంతబాబు సహకరించలేదనే ఆరోపణలు ఉన్న నేపథ్యంలో, ఈ ఒకరోజు కస్టడీని పోలీసులు అత్యంత కీలకంగా భావిస్తున్నారు.విచారణ అనంతరం ఆయనను తిరిగి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించనున్నారు. ఎమ్మెల్సీ కస్టడీ వార్తతో కాకినాడలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ కేసు విచారణ నెమ్మదిగా సాగిందన్న విమర్శలు ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాలన్న పట్టుదలతో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. అనంతబాబు జైలులో ఉంటూనే తన అనుచరుల ద్వారా సాక్షులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారనే సమాచారంతో పోలీసులు ఈ కస్టడీని కోరారు. సాక్షులు మాట మార్చకుండా ఉండేందుకు ఈ విచారణ అత్యంత కీలకం కానుంది. జైలు నుంచి లేదా బయట ఉన్న వ్యక్తులతో అనంతబాబు ఎవరితో మాట్లాడారు..? సాక్షులకు వెళ్లిన బెదిరింపు కాల్స్‌కు, అనంతబాబు అనుచరులకు ఉన్న సంబంధంపై పోలీసులు టెక్నికల్ ఆధారాలను సేకరించినట్లు సమాచారం.

## నెల్లూరులో చకచకా మహానాడు ఏర్పాట్లు

**నెల్లూరు మే 6, పెన్ పవర్:** టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు.. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని ఏటా నిర్వహించే పసుపు పండుగ –టీడీపీ మహానాడు.– పార్టీలో దీనికి ప్రత్యేక స్థానం ఉంది. ఈ మహానాడును మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. ఒక్క కరోనా సమయంలోనే ఆన్‌లైన్ వేదికగా దీనిని నిర్వహించా రు. ఆ తర్వాత.. పలు జిల్లాల్లో దీనిని నిర్వహిస్తూ.. పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ! ఈనెల 29న అన్నగారి జయంతిని పురస్కరించుకుని నిర్వహించే మహానాడుకు రెండు ప్రత్యేకతలు ఉన్నాయి. 1) తాజాగా జాతీయ, రాష్ట్ర స్థాయిలో కొత్త నాయకత్వాన్ని ఎన్నుకోవడం. ఇప్పటికే వారితో ప్రమా ణం కూడా చేయించారు. ప్రస్తుతం వీరి ఆధ్వర్యంలోనే మహానాడును నిర్వహించాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో యువత సెంట్రిక్‌గానే మహానాడును నిర్వహిం చేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. మహిళలకు ప్రాధాన్యం: ఈ దఫా టీడీపీలో మహిళా నాయకత్వాన్ని బలోపేతం చేయాలన్న లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే కమిటీలలోనూ వారికి ప్రాధాన్యం ఇచ్చారు. మహానాడు వేదికగా.. మహిళా ప్రాతినిధ్యంపై కీలక ప్రకటన చేయనున్నారు. ఈ నేపథ్యంలో మహానాడుకు అత్యంత ప్రాధాన్యం పెరిగింది. మరో రెండున్నరేళ్లలో రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం కూడా రానున్న నేపథ్యం కూడా దీనికి తోడైంది. వేదిక మార్పు వెను.. ! వాస్తవానికి ఈ దఫా మహానాడును శ్రీకాకుళంలో నిర్వహించాలని భావించారు. దీనికి సంబంధించి టెక్క లి, ఎచ్చర్ల నియోజకవర్గాల్లో రెండు చోట్ల పలు ప్రాంతాలను కూడా పరిశీలించారు. అయితే.. అనూహ్యంగా ఈ వేదిక నెల్లూరుకు మారింది. శ్రీకాకుళం కడు దూరంగా ఉండడం.. కార్యకర్తలను ఎండలో అక్కడకు తరలించడం ఇబ్బందిగా ఉంటుందన్న నేపథ్యంలో వేదికను నెల్లూరుకు మార్చారు. అదేసమయంలో సీమలో పార్టీని బలోపేతం చేయాలన్న లక్ష్యం కూడా దీనికి కలిసి వచ్చింది. కాగా.. గత ఏడాది మహానాడును కడపలో నిర్వహించిన విషయం తెలిసిందే.

# ఏపీ జననాయకుడిగా లోకేష్

**విజయవాడ, మే 6, పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీలో నారా లోకేష్ ప్రాధాన్యత అందరికీ తెలిసిందే. ఆయన చంద్రబాబు తరువాత స్థానంలో ఉన్నారు. ఈ మధ్యనే ఆయనకు పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని కూడా ఇచ్చారు బాబు ఆయనతో ప్రమాణం చేయించారు. ఇక ప్రభుత్వంలో కీలక శాఖలను చూస్తున్న యువ మంత్రిగా ఉన్నారు. అలా పార్టీ ప్రభుత్వంలో లోకేష్ ప్రాధాన్యతమైన ప్రభావవంతమైన పాత్ర నిర్వహిస్తున్నారు. అయితే ఇది మాత్రమే సరిపోదని జనాలకు పార్టీ జనాలకు లోకేష్ మరింతగా కనెక్ట్ కావాల్సిన అవసరం ఉందని పార్టీ భావిస్తోంది అని అంటున్నారు. రాష్ట్రంలో చూస్తే పక్కా మాస్ లీడర్ గా లోకేష్ ని చూపించాలన్న వ్యూహం టీడీపీకి ఉందని అంటున్నారు. లోకేష్ ఇప్పటికే పార్టీ వారిని కలుస్తున్నారు. ప్రభుత్వంలో మంత్రులతో కూడా ఇంటరాక్ట్ అవుతున్నారు. ఎమ్మెల్యేలతో కూడా ఆయన కలసి మెలసి ఉంటున్నారు. క్యాడర్ కి దగ్గరగా ఉండడం చేస్తున్నారు. అయితే ఇది చాలదని అంత కంటే ఎక్కువగా జనంలో ఉండేలా ఒక బృహత్ కార్యక్రమం పార్టీ పెద్దలు డిజైన్ చేస్తున్నారు. అది ఎంతలా అంటే లోకేష్ పేరు జన బాహుళ్యంలో మారు మోగేలా అని అంటున్నారు. లోకేష్ యువగళం పాదయాత్ర సమయంలో తనలోని నాయకత్వ లక్షణాలను బయటపెట్టారు. దాంతో అందరూ ఆయనలోని కొత్త కోణాన్ని చూశారు అలా ఒకేసారి లోకేష్ పది మెట్లు ఎక్కేశారు. అయితే ఇపుడు పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో లోకేష్ మళ్ళీ జనంతో కనెక్ట్ కావాల్సి ఉందని భావిస్తున్నారు. ఇక నారా లోకేష్ విషయం తీసుకుంటే ఆయన 2023లో చేపట్టిన యువగళం పాదయాత్ర సూపర్ సక్సెస్ అయింది అంతకు ముందు ఆ తరువాత అన్నట్లుగా లోకేష్ పాత్రను మార్చేసింది. ఇక ఆ మీదట టీడీపీ కూటమి విజయం సాధించడం లోకేష్ ప్రభుత్వంలో మంత్రిగా ఉండడం గడచిన రెండేళ్ళలో తన సత్తాను తన శాఖలల నిరూపించుకోవడం వంటివి జరుగుతున్నాయి. అయితే ఈసారి అలా కాదు, 2029 ఎన్నికల నేపథ్యంలో లోకేష్ ఇంతకు ఇంత రాజకీయంగా రాటు తేలాలీ అంటే జనంలో నిత్యం ఉండేలా పార్టీ రాష్ట్ర స్థాయి పర్యటనలు



కార్యక్రమాలు డిజైన్ చేస్తోంది అని అంటున్నారు ఫుల్ ఫోకస్ ఉండేలా : ఏపీలో చంద్రబాబుకు దిగ్గజ నేతగా పేరుంది. ఆయన వారసుడిగా లోకేష్ కి పార్టీలో ఎదురులేదు, యాక్సెప్టెన్స్ ఉంది. అయితే జనసామాన్యంలో కూడా దానికి బలమైన ఆమోదం అవసరం అన్నదే పార్టీ వ్యూహకర్తల భావనగా ఉంది. చంద్రబాబు తరువాత సిసలైన నాయకుడు పార్టీకే కాదు రాష్ట్రానికి రేపటి రాష్ట్ర భవిష్యత్తుకూ లోకేష్ అని ఏపీలోని ఆరు కోట్ల జనాలు అంతా ఆమోదించేలా ఉండాలీ అంటే లోకేష్ మరింతగా జనంలో ఉంటూ తన సత్తాను నిరూపించుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు. దాని కోసమే పార్టీ ఒక భారీ యాక్షన్ ప్లాన్ ని రూపొందిస్తోంది అని అంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలీ అంటే లోకేష్ మీదనే ఫుల్ ఫోకస్ ఉండేలా టీడీపీ పథక రచన చేస్తోంది అని అంటున్నారు. పార్టీ అధినేత వేరు, మంత్రిగా సామర్థ్యం వేరు, ఆరు కోట్ల మంది ఉన్న ఒక రాష్ట్రాన్ని నడిపించే అధినేతగా ఉండడం వేరు. జనాలకు ఆ భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని అంటున్నారు లోకేష్ లో చంద్రబాబుని చూసుకునేలా ఉండాలంటే మరింతగా లోకేష్ జనంలో ఉంటూ కష్టపడాల్సి ఉందని అంటున్నారు. పై స్థాయిలో పార్టీ పరంగా పదవులు అందుకోవడం కాకుండా జనం నుంచే వాటికి తగిన ఆమోద ముద్ర వేయించుకోవాలంటే ప్రజల వద్దకు లోకేష్ వెళ్లడమే ఉత్తమ మార్గం అని పార్టీలో చర్చ సాగుతోంది. దాంతో రానున్న కాలంలో లోకేష్ తో రాష్ట్ర స్థాయిలో పర్యటించేందుకు భారీ కార్యక్రమాలనే డిజైన్ చేయిస్తున్నారు అని అంటున్నారు. అవి ఏ స్థాయిలో ఉంటాయో యువ గళాన్ని మించి ఏ తీరున ఉంటాయో అన్నది వేచి చూడాల్సి ఉంది. ఏది ఏమైనా లోకేష్ జన నాయకుడు అనిపించుకోవాలని చూస్తున్నారు అని అంటున్నారు. సో ఆ దిశగా భారీ కార్యాచరణ అయితే టీడీపీ సిద్ధం చేసి పెడుతోంది అని అంటున్నారు

# ఉత్తరాంధ్రలో వారసులోస్తున్నారు

**విశాఖపట్టణం, మే 6, పెన్ పవర్:** రాజకీయాల్లో వారసత్వాలకు కొరత, కొదవలేదు. సీనియర్లు తమ కుటుంబాల నుంచి నాయకులను పరిచయం చేస్తున్నారు. యువ నేతలు కూడా దూకుడుగానే వ్యవహరిస్తున్నారు. టికెట్ వస్తుందా రాదా అనే విషయాన్ని పక్కన పెడితే యువ నేతలు ఉత్సాహంగానే రాజకీయాలు చేసేందుకు ముందుకు వస్తున్నారు .ఈ క్రమంలో రాయలసీమ నుంచి ఎక్కువ మంది యువ నేతలు కనిపిస్తుండగా.. అదే స్థాయిలో ఉత్తరాంధ్ర నుంచి కూడా యువ నేతలు రాజకీయ రంగ ప్రవేశం ఇప్పటికే చేశారు. మరి కొందరు రెడీగా కూడా ఉన్నారు. అయితే వీరిలో ఎంతమంది ప్రజలను ఒప్పించగలరు.. మెప్పించగలరు.. ఓటు బ్యాంకును సాధించగలరు.. అనే విషయాలు ఎటు తేలడం లేదు. గత ఎన్నికల్లోనే ఒకరిద్దరు సీనియర్ నాయకులు తమ వారసులను రంగంలోకి దింపాలని భావించారు. , పోటీ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అటు వైసిపి ఇటు టిడిపి కూడా వారసులకు టికెట్లు ఇవ్వలేదు. దీంతో వారసులు పక్కకు తప్పుకోవాల్సి వచ్చింది. అయితే ఇప్పుడు వచ్చే ఎన్నికల నాటికి మాత్రం ఖచ్చితంగా తమ వారసులను బరిలో నెలపాలని సీనియర్లు ఇప్పటినుంచే పట్టుబడుతున్నారు. తమ పిల్లలను నియోజకవర్గాల్లోకి దింపేశారు కూడా. ఇలాంటి వారిలో ఉమ్మడి విశాఖపట్నంలోని నర్సీపట్నం నియోజకవర్గం నుంచి చింతకాయల విజయ్ దూకుడుగా ఉన్నారు. ఈయన పార్టీలో సీనియర్ యువనేతగా పనిచేస్తున్నారు. గత ఎన్నికల సమయంలోనూ దీనికి ముందు కూడా ఆయన యాక్టివ్గా పార్టీ కార్యక్రమాల్లో పార్టిసిపేట్ చేశారువచ్చే ఎన్నికల్లో కచ్చితంగా విజయ్ కు టికెట్ ఇవ్వాల్సిందేనని ఆయన తండ్రి, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పట్టుబడుతున్నారు. పైగా లోకేష్ టీం లో ఉన్నారన్న చర్చ కూడా వినిపిస్తోంది. దీంతో ఖచ్చితంగా విజయ్‌కు టికెట్ లభించటం ఖాయమని అంటున్నారు. ఇక స్థానికంగా ఉన్న రాజకీయాలను గమనిస్తే చింతకాయల విజయ్ కు యువత ఫాలోయింగ్ ఎక్కువగానే ఉంది. ప్రజల్లోనూ అయ్యన్నపాత్రుడుకు ఉన్న సానుభూతి.. వారికి ఉన్న రాజకీయ వర్గం విజయ్‌కు అనుకూలంగానే మారే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో ఆయన విజయం సాధించడం ఖాయమని చెబుతున్నారు ఇక ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని ఆముదాల వలస నియోజకవర్గం నుంచి ఈ దఫా తమ్మినేని చిరంజీవి కచ్చితంగా పోటీ చేస్తారని ఆయన తండ్రి అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఘంటాపదంగా చెబుతున్నారు. వాస్తవానికి గత ఎన్నికల్లోనే చిరంజీవి నాగ్‌కు టిక్కెట్టు ఇవ్వాలని సీతారాం పట్టుబట్టారు. కానీ.. అనూహ్యంగా రాజకీయ పరిణామాలు మారిపోవడంతో జగన్ ఈ విషయాన్ని పక్కనపెట్టి సీతారామ్‌కే టికెట్ కేటాయించారు.

కానీ ఇప్పుడు ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నందున వచ్చే ఎన్నికల్లో చిరంజీవి నాగ్ కు టికెట్ ఇవ్వాల్సిందేనని సీతారాం తేల్చేశారు. దీనిపై వైసీపీ అధినేత జగన్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోయినప్పటికీ టికెట్ ఖాయమనే చర్చ నడుస్తోంది ఇక చిరంజీవి రాజకీయాలను చూసుకుంటే గత రెండు ఎన్నికల్లో కూడా తండ్రి తరఫున ఆయన ప్రచారం చేశారు. యువతను ఆకట్టుకునే లాగా వ్యవహరించారు. ముఖ్యంగా ఐటి రంగంలో అనుభవం ఉన్న చిరంజీవి సోషల్ మీడియా వేదికగా ప్రచారాన్ని ముమ్మరం చేయడం విశేషం. తరచుగా సోషల్ మీడియాలో ఆయన అనేక పోస్టులు పెడుతూ ఉంటారు. యూట్యూబ్ లో చానల్స్ కూడా నడుపుతారు. దీంతో ఆయనకు మంచి ఫాలోయింగ్ ఉందని చెబుతారు. ఇది వచ్చే ఎన్నికల్లో చిరంజీవికి కలిసివచ్చే అంశం అని అంటున్నారు. ఇక ఉత్తరాంధ్రకు చెందిన మరో యువ నాయకుడు కిడారి శ్రావణ్ కుమార్ 2014లో వైసిపి తరఫున అరకు నుంచి పోటీ చేసిన కిడారి సర్వేశ్వరరావు తర్వాత కాలంలో టిడిపిలోకి వచ్చారు. ఆయనకు మంత్రి పదవి దక్కుతుందని కూడా చర్చ నడిచింది. ఇంతలోనే మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో సర్వేశ్వరరావు మృతి చెందారు. అనంతరం ఆయన వారసుడిగా కిడారి శ్రావణ్ టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ క్రమంలోనే చంద్రబాబు ఆయనకు మంత్రి పదవి కూడా ఇచ్చారు. నిజానికి అప్పటికి అటు అసెంబ్లీకి కానీ ఇటు శాసన మండలికి కానీ శ్రావణ్ కుమార్ ప్రాతినిధ్యం వహించడం లేదు. అయినప్పటికీ ఆరు మాసాల పాటు ఆయన మంత్రిగా పనిచేశారు. తర్వాత 2019 ఎన్నికల్లో అదే అరకు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయనకు టిడిపి టికెట్ ఇచ్చింది. కానీ వైసీపీ హవాతో పాటు జగన్ పాదయాత్ర కారణంగా శ్రావణ్ కుమార్ పరాజయం పాలయ్యారు. ఓ రకంగా చెప్పాలంటే ఆయనకు డిపాజిట్ దక్కలేదని కూడా ప్రచారంలో ఉంది. గత ఎన్నికల విషయానికి వచ్చేసరికి అసలు పార్టీ టికెట్ కూడా ఇవ్వలేదు. అంతర్గతంగా చేయించిన సర్వేలు పార్టీ సీనియర్ నాయకులు చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకున్న చంద్రబాబు గత ఎన్నికల్లో ఈ టికెట్ను మిత్రపక్షమైన బిజెపికి కేటాయించారు. ఇక వచ్చే ఎన్నికల నాటికైనా కిడారి శ్రావణ్‌కు టికెట్ దక్కుతుందా లేదా అనేది చూడాలి.

ప్రస్తుతం అయితే ఆయన తన ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే సమయంలో యువతను ఆకర్షించే దిశగా కూడా ప్రయత్నిస్తున్నారు. కానీ, వచ్చే ఎన్నికల నాటికి టికెట్ విషయంలో పార్టీ నుంచి ఇంకా ఎటు వంటి హామీ లభించలేదు. ఆయన చేసే పనితీరు, పార్టీలో వ్యవ హరించే విధానాలు, పార్టీని ముందుకు తీసుకెళ్లే విషయంలో ఎలా వ్యవహరిస్తారు అనే అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే టికెట్ పై క్లారిటీ వచ్చే అవకాశం ఉందని స్థానిక టిడిపి నేతలు చెబుతున్నారు. సో ఇలా కొంతమంది యువ నాయకులు ఉత్తరాంధ్ర నుంచి రాజకీయాల్లోకి వచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మరి ఏ మేరకు సక్సెస్ అవుతారు అనేది చూడాలి.

# ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ రేసులో ఉత్కంఠ... ఏ జట్టు పరిస్థితి ఎలా ఉందంటే?

- రసవత్తరంగా మారిన ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ రేసు
- పాయింట్ల పట్టికలో టాప్-4లో పంజాబ్, బెంగళూరు, హైదరాబాద్, రాజస్థాన్
- రేసులోకి బలంగా పుంజుకున్న చెన్నై సూపర్ కింగ్స్
- ఢిల్లీ, కోల్‌కతా, ముంబై జట్లకు ప్రతి మ్యాచ్ 'డూ ఆర్ డై'
- అనేక జట్ల భవిష్యత్తును నిర్ధారించనున్న నెట్ రన్ రేట్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్ ప్లేఆఫ్స్ రేసు ఊహించని మలుపులతో అత్యంత రసవత్తరంగా మారింది. లీగ్ దశ ముగింపునకు వస్తున్నా, ఏ జట్టుకూ ఇంకా ప్లేఆఫ్స్ బెర్త్ ఖరారు కాలేదు. గణాంకాల ప్రకారం ఇంకా ఏ జట్టూ అధికారికంగా రేసు నుంచి నిష్క్రమించకపోవడంతో రాబోయే ప్రతి మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగనుంది. ముఖ్యంగా పాయింట్ల పట్టికలో జట్ల మధ్య స్వల్ప తేడాలు మాత్రమే ఉండటంతో నెట్ రన్ రేట్ (చీ==) కీలకంగా మారనుంది.

**అగ్రస్థానంలో పంజాబ్, బెంగళూరు**

ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ (పీబీకేఎస్), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్లు పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి. పంజాబ్ 13 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, బెంగళూరు 12 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. ఈ రెండు జట్లూ మెరుగైన నెట్ రన్ రేట్‌ను కలిగి ఉండటం వారికి కలిసొచ్చే అంశం. పంజాబ్ తన మిగిలిన 5 మ్యాచ్‌లలో 2 గెలిస్తే సులభంగా అర్హత సాధిస్తుంది. ఇక, ఆర్‌సీబీ (ం1.420)కి ఉన్న భారీ నెట్ రన్ రేట్ వారి ప్రధాన బలం. వారు 2-3 విజయాలు సాధిస్తే ప్లేఆఫ్స్ బెర్త్ ఖాయం.

**మధ్యలో తీవ్ర పోటీ.. పుంజుకున్న చెన్నై**

సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH), రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్), గుజరాత్ టైటాన్స్ (జీటీ) జట్లు కూడా 12 పాయింట్లతో టాప్ జట్లకు గట్టి పోటీ ఇస్తున్నాయి. అయితే, ఈ మూడు జట్లు పంజాబ్, బెంగళూరు కంటే ఒక మ్యాచ్ అదనంగా ఆడాయి. హైదరాబాద్, రాజస్థాన్ పాజిటివ్ రన్ రేట్‌తో మెరుగైన స్థితిలో ఉండగా, గుజరాత్ టైటాన్స్ నెగటివ్ రన్ రేట్‌తో (-0.147) ఇబ్బంది పడుతోంది. జీటీ ప్లేఆఫ్స్ చేరాలంటే రాబోయే మ్యాచ్‌లలో భారీ విజయాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

మరోవైపు, సీజన్‌ను నెమ్మదిగా ప్రారంభించిన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) చివరి నాలుగు మ్యాచ్‌లలో మూడు గెలిచి రేసులోకి బలంగా పుంజుకుంది. రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలోని ఈ జట్టు, మిగిలిన 4 మ్యాచ్‌లలో కనీసం 3 గెలవడం ద్వారా 16 పాయింట్లతో ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలని చూస్తోంది. సీఎస్‌కేకి ఉన్న పాజిటివ్ నెట్ రన్ రేట్ (ం0.151) చివరి దశలో వారికి ఉపయోగపడవచ్చు.

**ఇకపై ప్రతి మ్యాచ్ కీలకమే**

ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ), కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్), ముంబై ఇండియన్స్ (ఎంఐ) జట్ల పరిస్థితి క్లిష్టంగా మారింది. ఢిల్లీకి ఇకపై ఒక్క ఓటమి కూడా వారి అవకాశాలను దెబ్బతీస్తుంది. మిగిలిన అన్ని మ్యాచ్‌లు గెలిస్తేనే వారికి అవకాశం ఉంటుంది. కోల్‌కతా, ముంబయి జట్లు కూడా దాదాపు ఇదే పరిస్థితిలో ఉన్నాయి. ఈ జట్లు మిగిలిన అన్ని మ్యాచ్‌లు గెలవడంతో పాటు ఇతర జట్ల ఫలితాలు కూడా తమకు అనుకూలంగా రావాలని కోరుకోవాలి. ఈ మూడు జట్లకు వారి నెగటివ్ నెట్ రన్ రేట్ పెద్ద అవరోధంగా మారింది. లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) అద్భుతంగా రాణించి మిగిలిన అన్ని మ్యాచ్‌లు గెలిచినా, వారి అత్యంత దారుణమైన నెట్ రన్ రేట్ (-1.076) కారణంగా ప్లేఆఫ్స్ చేరడం దాదాపు అసాధ్యం.

మొత్తం మీద రాబోయే రెండు వారాలు అభిమానులకు అసలైన టీ20 మజాను పంచనున్నాయి. ప్రతి పరుగు, ప్రతి వికెట్ పాయింట్ల పట్టికను, జట్ల భవిష్యత్తును మార్చే అవకాశం ఉండటంతో ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ రేసు చివరి బంతి వరకు ఉత్కంఠగా సాగడం ఖాయం.

# వీఐపీ టికెట్ల రగడ: బెంగళూరులో ఫైనల్ నిర్వహణపై బీసీసీఐ పునరాలోచన

- ఐపీఎల్ 2026 ఫైనల్ వేదికపై సందిగ్ధత
- ఎమ్మెల్యేల ఉచిత టికెట్ల వివాదంతో బెంగళూరుకు గండం
- సమస్య పరిష్కరించకపోతే వేదిక మార్పు తప్పదని బీసీసీఐ హెచ్చరిక
- డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో ఆర్సీబీకి దక్కాల్సిన ఆతిథ్యం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్ తుది అంకానికి చేరుకుంటున్న వేళ, ఫైనల్ మ్యాచ్ వేదికపై తీవ్ర అనిశ్చితి నెలకొంది. కర్ణాటకలో ఎమ్మెల్యేలకు ఉచిత టికెట్ల కేటాయింపుపై చెలరేగిన వివాదం కారణంగా, ఫైనల్ మ్యాచ్‌ను బెంగళూరు నుంచి మరో నగరానికి తరలించే యోచనలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఉన్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ నిబంధనల ప్రకారం, గత సీజన్ విజేత హోమ్‌గ్రౌండ్‌లోనే ఫైనల్ నిర్వహించడం ఆనవాయితీ. ఈ లెక్కన డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) సొంతగడ్డ అయిన చిన్నస్వామి స్టేడియంలోనే ఫైనల్ జరగాల్సి ఉంది. అయితే, "మేము ప్రజాప్రతినిధులం, వీఐపీలం, క్యూలో నిల్చోలేం" అంటూ కొందరు ఎమ్మెల్యేలు ఉచిత టికెట్ల కోసం డిమాండ్ చేయడం వివాదానికి దారితీసింది. ఈ వ్యవహారంపై బీసీసీఐ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ఈ వివాదంపై కర్ణాటక ప్రభుత్వం స్పందించి, ప్రతి ఎమ్మెల్యేకు మూడు టికెట్లు కేటాయిస్తామని సర్దిచెప్పే ప్రయత్నం చేసింది. అయినప్పటికీ, ఈ రాజకీయ రగడ ఫైనల్ వంటి మెగా ఈవెంట్ నిర్వహణకు ఆటంకం కలిగించవచ్చని బీసీసీఐ భావిస్తోంది. "టికెట్ల సమస్యకు పరిష్కారం లభించకపోతే, ఫైనల్ వేదికను మరో నగరానికి తరలిస్తాం" అని బీసీసీఐ వర్గాలు స్పష్టం చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ప్లేఆఫ్ మ్యాచ్‌లను పంజాబ్, కర్ణాటక రాష్ట్రాల్లో నిర్వహించే అవకాశం ఉన్నప్పటికీ, ఫైనల్ వేదికపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ప్రస్తుతం లీగ్ దశలో పంజాబ్ కింగ్స్ 13 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, ఆర్సీబీ, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్, గుజరాత్ టైటాన్స్ 12 పాయింట్లతో గట్టి పోటీ ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఫైనల్ వేదికపై బీసీసీఐ అధికారిక ప్రకటన కోసం క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# పంజాబ్‌పై హైదరాబాద్ ఘన విజయం.. పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి సన్‌రైజర్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్‌లో భాగంగా పంజాబ్ కింగ్స్‌తో ఉప్పల్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 33 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 235 పరుగులు చేసింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ ఏ దశలోనూ లక్ష్యాన్ని చేధించే ప్రదర్శన కనబరచలేదు. 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 202 పరుగులకే పంజాబ్ కుప్పకూలింది.పంజాబ్ బ్యాట్స్‌మెన్ కూపర్ కానెల్లి ఒంటరి పోరాటం చేశాడు. 59 బంతుల్లోనే 107 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. పంజాబ్ జట్టులో మిగిలిన ఆటగాళ్లు ఎవరూ రాణించలేదు. ఈ గెలుపుతో హైదరాబాద్ పాయింట్ల పట్టికలో పంజాబ్‌ను వెనక్కి నెట్టి అగ్రస్థానంలోకి వచ్చింది. 11 మ్యాచ్‌లకు గాను 7 మ్యాచ్‌లు గెలిచి 14 పాయింట్లతో మొదటి స్థానంలో ఉంది. పంజాబ్ కింగ్స్ రెండో స్థానానికి పడిపోయింది.



# జాన్వీ హొయలు ఆ రేంజులో..







సాక్షి మాలిక్ గోల్డెన్ గ్లామర్‌లో టైమ్‌లెస్ గాంభీర్యంతో మెరిసింది

బాలీవుడ్ అందాల నటి జాన్వీ కపూర్ ప్రస్తుతం నటనా రంగంలోనే కాదు.. ఫ్యాషన్ ప్రపంచంలోనూ తనదైన ముద్ర వేస్తోంది. అటు బాలీవుడ్‌లో తిరుగులేని ఫ్యాషనిస్టాగా గుర్తింపు పొంది.. ప్రతి ఈవెంట్‌లోనూ తన ప్రత్యేకమైన వస్త్రధారణతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది. ఫ్యాషన్ ఇండస్ట్రీ - సినిమాల మధ్య సమతుల్యతను కాపాడుకుంటూ ఒక గ్లోబల్ బ్రాండ్‌గా ఎదిగే దిశగా అడుగులు వేస్తోంది. తాజాగా జాన్వీ ప్రముఖ పంజాబీ గాయకుడు ఆలపించిన గీతానికి అందమైన ఎక్స్ ప్రెషన్స్ తో ఇమ్మిటేట్ చేస్తూ యూత్ ని టీజ్ చేస్తోంది. ప్రస్తుతం ఈ వీడియో ఇంటర్నెట్ లో వైరల్ గా దూసుకెళుతోంది. ఇక కెరీర్ మ్యాటర్ కి వస్తే.. దక్షిణాది చిత్ర పరిశ్రమలో అగ్ర హీరోయిన్‌గా ఎదగాలనే లక్ష్యంతో ఉన్న జాన్వీకి, ఎన్టీఆర్ సరసన నటించిన -దేవర- చిత్రం భారీ విజయాన్ని అందించడమే కాకుండా.. ఇక్కడ బలమైన పునాదిని వేసింది. ప్రస్తుతం రామ్ చరణ్ సరసన -పెద్ది- సినిమాలో నటిస్తోంది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తుందని భారీ అంచనాలు ఉన్నాయి. ఇందులో రామ్ చరణ్ లాంటి పాన్ ఇండియా హీరోలతో పనిచేయడం జాన్వీ మార్కెట్ వాల్యూను మరింత పెంచుతోంది. -పెద్ది- చిత్ర బృందం ఇప్పటివరకు జాన్వీకి సంబంధించిన విజువల్స్ ని కానీ.. తన పాత్ర స్వభావాన్ని వెల్లడించకుండా సస్పెన్స్ మెయింటెయిన్ చేస్తోంది. అయితే సుకుమార్ రైటింగ్స్ వంటి ప్రతిష్టాత్మక బృందాలు రూపొందిస్తున్న చిత్రాల్లో నాయిక పాత్రలకు అధిక ప్రాధాన్యత ఉంటుంది. జాన్వీ కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా నటిగా తనలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించే అవకాశం ఉందని అభిమానులు ఆశిస్తున్నారు. నటిగా తన అస్తిత్వాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి జాన్వీకి ఇది సదవకాశం.జాన్వీ తన తల్లి శ్రీదేవి నటించిన -జగదేకవీరుడు అతిలోకసుందరి- వంటి క్లాసిక్ చిత్రాల సీక్వెల్స్‌లో నటించాలని అభిమానులు బలంగా కోరుకుంటున్నారు. -పెద్ది- తర్వాత రామ్ చరణ్‌తో కలిసి ఈ ప్రాజెక్ట్‌లో నటించాలని అభిమానులు కోరుకుంటున్నారు. అయితే వైజయంతి అధినేత అశ్వినీదత్ నుండి ఇంకా ఎటువంటి స్పష్టత రాలేదు. ఇటువంటి వారసత్వ బాధ్యతాయుతమైన చిత్రాలు జాన్వీ కెరీర్‌కు మరో పెద్ద మలుపునిస్తాయనడంలో సందేహం లేదు. కెరీర్ ప్రారంభంలోనే ఉత్తరాది- దక్షిణాది వంటి విభిన్న ప్రాంతీయ భాషా చిత్రాలను ఎంచుకోవడం వల్ల జాన్వీ పలు రకాల పని సంస్కృతులను అర్థం చేసుకునే అవకాశం పొందుతోంది. ఇలాంటి పాన్-ఇండియా ప్రయత్నాలు జాన్వీని ఒక ప్రాంతానికి పరిమితం చేయకుండా గ్లోబల్ ఆడియన్స్‌కు చేరువ చేస్తున్నాయి. మొత్తానికి శ్రీదేవి నటవారసురాలిగా జాన్వీ ఎంచుకుంటున్న ఈ భారీ చిత్రాలు తనను కేవలం ఒక బాలీవుడ్ నటిగానే కాకుండా.. దక్షిణాదిలో కూడా తిరుగులేని స్టార్‌గా నిలబెట్టే అవకాశం ఉంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com